STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 117 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 10 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |


క్యాన్సర్ రోగులకు ఊరట!



క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది.

- ఔషధాల ధరలకు గరిష్టంగా 96.45 శాతం వరకు కోత
- 137 రకాల మందులకు చెందిన 1,031 ఫార్ములేషన్ల ధరల సవరణ
- దేశవ్యాప్తంగా సవరించిన ధరలు అమల్లోకి వచ్చినట్లు ప్రకటన

.. వివరాలు 4లో



రాజకీయాలకు అతీతంగా
నా ఆత్మకథ

ఏఐసీసీ నాయకురాలు సోనియా గాంధీ

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తన రాబోయే ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇది రాజకీయ అంశాలతో కూడిన పుస్తకం కాదని, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుభవాలు, కుటుంబ అనుబంధాలు, ప్రేమ, విధేయత వంటి అంశాలే ఇందులో ప్రధానంగా ఉంటాయని స్పష్టం చేశారు.

4

రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజల మద్దతు



- స్థానిక సంస్థల్లో 82 శాతం వార్డులు ఎన్డీఏ ఖాతాలోకే
- పోస్టల్ బ్యాలెట్‌తోనూ కూటమికే అత్యధిక ఓట్లు
- పల్లె, పట్టణం తేడా లేకుండా ఎన్డీఏ పక్షాల జోరు
- నాలుగు పదవులకే పరిమితమైన వైసీపీ
- మేయర్లు, చైర్‌పర్సన్లలో 60 శాతం మంది మహిళలే
- 62 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే
- అన్ని వర్గాలు, ప్రాంతాల నుంచి సంపూర్ణ మద్దతు
- స్థానిక పోరులో క్లీన్ స్వీప్ చేసిన కూటమి
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు
- ఓటమిని అంగీకరించాలంటూ ప్రతిపక్షానికి సూచన

వివరాలు 2లో..

"గత ఐదేళ్ల విధ్వంసక పాలనను అంతం చేసి, మనం మొదలుపెట్టిన రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞానికి ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనమైన మద్దతు పలికారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా ప్రతి వర్గం కూటమి అభ్యర్థులకు బ్రహ్మరథం పట్టింది. వందకు ఏకంగా 94 స్థానాల్లో కూటమిని గెలిపించి.. గత పాలకులకు మరోసారి గుణపాఠం చెప్పారు. అరవై శాతం మహిళలు, అత్యధికంగా యువత, ఉన్నత విద్యావంతులను మేయర్లు, చైర్‌పర్సన్లుగా గెలిపించిన ప్రజలకు రెండు చేతులు జోడించి, శిరస్సు వంచి నమస్కరిస్తున్నా" అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్డీఏ కూటమి సాధించిన విజయంపై సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఫలితాలను విశ్లేషించారు.



వైద్య సేవల్లో..
పల్నాడు ఫస్ట్!

మంత్రికి అందిన నివేదిక

.. వివరాలు 2లో

కోలుకుంటున్న
గోపిక!

- సాధారణ వార్డుకు తరలింపు
- మెరుగుపడుతున్న ఆరోగ్యం
- చేతికి ఉన్న పట్టీ తొలగింపు
- మంత్రి సత్యకుమార్ వెల్లడి

.. వివరాలు 2లో

నేటి నుంచి
హెచ్ఆర్‌సీ కోర్టులు!



.. వివరాలు 3లో



ఓటమిపై రిపోర్ట్!

జగన్‌కు చేరిన రహస్య నివేదిక?

విశ్లేషించిన ఐఐటీ గ్రాడ్యుయేట్లు

బయటపడిన ఆరు సంచలన విషయాలు

ప్రచారానికే పరిమితమైన నేతలు


ప్రత్యర్థులతో లోపాయికారీ ఒప్పందాలు

మార్పులు చేయకుంటే 2029లో దెబ్బే!

2

ఏపీ.. పాలనలో
అగ్రగామి

- యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం
- సామాజిక, ఆర్థిక భద్రత విభాగంలో దేశంలోనే ఫస్ట్ ర్యాంక్
- ఆదాయం తక్కువున్నా.. అవకాశాల కల్పనలో మెరుగైన స్థానం
- రెండున్నరేళ్ల పాలనకే ఈ గుర్తింపు అన్న సీఎం చంద్రబాబు నాయుడు



2

అగ్నిప్రమాదాలపై
సీఎం ఆరా!

- రాజాం, గన్నవరం, తిరువూరుల్లో అగ్ని కీలలు
- ఆస్తినష్టం జరగడంపై విచారం
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం

2లో

గొర్రెతోలు
కప్పుకున్న తోడేలు

- చంద్రబాబుపై జగన్ ఫైర్!
- రిగ్గింగ్ మాస్టర్ పేరుతో హ్యాష్‌ట్యాగ్
- సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు

3లో

వడ్డీతో సహా.. తీర్చేస్తాం!

- కూటమి నేతలకు అంబటి వార్నింగ్
- అక్రమ కేసులన్నీ మాకు బాకీలే
- తిరిగి వచ్చాక ఎవరినీ వదలం
- వైసీపీ కేడర్ ఊరుకునే ప్రసక్తే లేదు
- గుంటూరు జైలులో అప్పిరెడ్డికి పరామర్శ



3

పెట్టుబడుల వేదిక!

విశాఖలో సీఐఐ సదస్సు.. వాణిజ్యం నుంచి క్వాంటం వరకు చర్చలు

58 దేశాల పారిశ్రామికవేత్తల రాక ..ఇప్పటికే 86 వేల కోట్ల ఒప్పందాలు

హాజరుకానున్న చంద్రబాబు, అమిత్ షా



.. వివరాలు 3లో



సీఐఐ సదస్సుకు
ముమ్మర ఏర్పాట్లు

- సదస్సుకు 1,250 మందికి పైగా హాజరు
- జూమ్ ద్వారా మంత్రి సమీక్ష
- ఆరు కీలక రంగాలపై చర్చలు
- గత ప్రభుత్వ తీరుపై విమర్శలు

2లో

మురసుతో భారీ నష్టం!

- దెబ్బతిన్న 1,302 కిలోమీటర్ల రోడ్లు
- అత్యధికంగా బాపట్ల జిల్లాలో విలయం
- పునరుద్ధరణకు 871 కోట్ల నిధులు
- అంచనాలు వెల్లడించిన మంత్రి జనార్థన్ రెడ్డి

3



ఆ దుస్తులతో..
బయట తిరగొద్దు!

ఓటీ, ఐసీయూలకే ప్రత్యేక దుస్తులు

సూపరింటెండెంట్లకు డీఎంఈ ఆదేశాలు

3



ఏపీ.. పాలనలో అగ్రగామి


యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్-2026లో ఆంధ్రప్రదేశ్‌కు రెండో స్థానం

సామాజిక, ఆర్థిక భద్రత విభాగంలో దేశంలోనే ఫస్ట్ ర్యాంక్

ఆదాయం తక్కువున్నా.. అవకాశాల కల్పనలో మెరుగైన స్థానం

రెండున్నరేళ్ల పాలనకే ఈ గుర్తింపు అన్న సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : ప్రజలకు సమాన అవకాశాలు, మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి కీలక అంశాల్లో ఆంధ్రప్రదేశ్ జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించింది. ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ రూపొందించిన 'యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ఉ2026' నివేదికలో దేశంలోని 28 రాష్ట్రాలకు గాను ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఈ నివేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. గత రెండున్నరేళ్లుగా తమ ప్రభుత్వం చేపడుతున్న పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఈ నివేదిక అద్దం పడుతోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రాల ఆర్థిక సంపదతో పాటు ఆ సంపదను ప్రజలకు సమాన అవకాశాలు, అవసరమైన సేవలు, సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వాలు ఎంత సమర్థంగా వినియోగిస్తున్నాయన్న అంశాలను ఈ సూచీలో పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సూచీలో గోవా 0.68 స్కోరుతో తొలి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ 0.66 స్కోరుతో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆ తర్వాత సిక్కిం, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు నిలిచాయి. ఐదు ప్రధాన అంశాలు, 23 విభాగాలు, 60 సూచికల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. ప్రాథమిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక, ఆర్థిక భద్రత, న్యాయ సేవలను ఇందులో విశ్లేషించారు. ఇందులో సామాజిక, ఆర్థిక భద్రత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ఏకంగా 0.69 స్కోరుతో దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించింది. మిగిలిన నాలుగు విభాగాల్లోనూ అగ్రశ్రేణి జాబితాలో నిలిచింది.



సంపద కంటే అవకాశాలే ముఖ్యం..

తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 13వ స్థానంలో ఉన్నప్పటికీ, ప్రజలకు అవకాశాలు కల్పించే విషయంలో అంచనాలకు మించి రెండో స్థానంలో నిలవడం ఈ నివేదికలోని ముఖ్యాంశం. రాష్ట్ర ఆర్థిక స్థాయిని బట్టి అంచనా వేసిన యాక్సెస్ స్కోరు 0.51 కాగా, వాస్తవ స్కోరు 0.66గా నమోదైంది. అంటే అంచనాలకు మించి 0.15 పాయింట్లు అదనంగా సాధించింది. ఆదాయానికి, ప్రజలకు అందుతున్న అవకాశాలకు మధ్య సానుకూల వ్యత్యాసం ఏపీలో అత్యధికంగా నమోదైనట్లు నివేదిక స్పష్టం చేసింది. తాగునీరు, పారిశుద్ధ్యం, గృహవసతి, వైద్యం, విద్య, ఉపాధి తదితర సదుపాయాలు ప్రజలకు ఎంతమేర అందుబాటులో ఉన్నాయన్న అంశాలను ఈ నివేదిక విశ్లేషించింది. పెట్టుబడులను ఆకర్షించి సంపద సృష్టించడంతో పాటు ప్రజలకు మెరుగైన పాలన అందించడం, వారికి అందుబాటులో ఉన్న అవకాశాలను విస్తరించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజలకు సేవలు, వనరులు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన అధికారులను ఆయన అభినందించారు. ప్రతి ప్రాంతానికి, ప్రతి వర్గానికి పాలన, అభివృద్ధి ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

అగ్నిప్రమాదాలపై సీఎం ఆరా!

రాజాం, గన్నవరం, తిరువూరుల్లో అగ్ని కీలలు

ఆస్తినష్టం జరగడంపై ముఖ్యమంత్రి విచారం

అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : రాష్ట్రంలోని విజయనగరం జిల్లా రాజాంతో పాటు వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు అగ్నిప్రమాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి ప్రమాదాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాజాంలోని ఓ ఆటోమొబైల్ షోరూమ్‌పై దీపావళి టపాసులు ప్రమాదవశాత్తు పడటంతో మంటలు అంటుకుని భారీగా ఆస్తినష్టం జరిగింది. కృష్ణా జిల్లా గన్నవరంలో బాణాసంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరిపడి ఓ ఫర్నిచర్ దుకాణానికి మంటలు అంటుకున్నాయి. అటు ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోని మరో దుకాణంలోనూ షార్ట్ సర్క్యూట్ జరిగి పూర్తిగా దగ్ధమైంది. మంటల కారణంగా ఈ మూడు ప్రాంతాల్లో ఆస్తినష్టం జరగటంపై ముఖ్యమంత్రి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే అగ్నిమాపక శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని మంటలు అదుపు చేసినట్లు సీఎంకు వివరించారు. ఎక్కడ ఎలాంటి ప్రమాదం జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

కోలుకుంటున్న గోపిక!

సాధారణ వార్డుకు తరలింపు.. మెరుగుపడుతున్న బాలిక ఆరోగ్యం

చేతికి ఉన్న పట్టీ తొలగింపు..

మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాప్తాడు ఉన్మాది బాధితురాలు గోపిక ఆరోగ్యం మరింత మెరుగుపడిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఆరోగ్య పరిస్థితి కుదుటపడటంతో బాలికను చిన్నపిల్లల అత్యవసర చికిత్స విభాగం నుంచి సాధారణ వార్డుకు తరలించారని ఆయన ఒక ప్రకటనలో ప్రకటించారు.

గాయాలు నయం అవుతున్నాయి..

సోమవారం వైద్య బృందం గోపికకు మరోసారి కట్లు మార్చిందని మంత్రి తెలిపారు. తల, మెడ, ముఖం, చేతులు, వీపుపై ఉన్న గాయాలకు కట్లు మార్చారని, ప్రస్తుతం గాయాల పరిస్థితి బాగానే ఉందని వివరించారు. బాలిక చికిత్సను బాగా తట్టుకుంటోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎడమ చేతికి ఉన్న పట్టీని తొలగించడంతో, ఇప్పుడు గోపిక తన చేతిని కదిలించుకునే వీలు కలిగిందని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

వైద్యుల పర్యవేక్షణలో..

దగ్గినప్పుడు బాలికకు ఛాతీలో కాస్త నొప్పి వస్తోందని, దాన్ని మందులతో అదుపు చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. బాలిక సొంతంగా ఆహారం తక్కువగా తీసుకుంటుండటంతో ముక్కు ద్వారా గొట్టంతో ఆహారం అందిస్తున్నామని, అయితే సహజంగా నోటి ద్వారా తినేలా వైద్యులు ఆమెను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం డాక్టర్ భాస్కర్ షెనాయ్ పర్యవేక్షణలో.. ప్లాస్టిక్ సర్జరీ, ఆర్థోపెడిక్ వైద్యుల సమన్వయంతో గోపికకు అత్యుత్తమ చికిత్స అందుతోందని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజల మద్దతు

- **స్థానిక సంస్థల్లో 82 శాతం వార్డులు ఎన్డీఏ ఖాతాలోకే**
- **మేయర్లు, చైర్‌పర్సన్లలో 60 శాతం మంది మహిళలే**
- **62 శాతం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకే**
- **మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు**

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు ఘన విజయాన్ని అందించారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ప్రాంతాలు, వర్గాలు, పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని చోట్లా కూటమికి అనుకూల ఫలితాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో రెండున్నరేళ్లుగా ప్రభుత్వం చేపడుతున్న పునర్నిర్మాణ కార్యక్రమాలకు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపారని ఆయన వెల్లడించారు. ఎన్నికల ఫలితాల అనంతరం సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వివరాలు పంచుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు రాష్ట్రంలో భారీ విధ్వంసం జరిగిందని, ఆ పరిస్థితులను ప్రజలకు వివరించేందుకు ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామని గుర్తుచేశారు. స్వర్ణాంధ్ర విజన్‌తో పాలన ప్రారంభించి పేదరిక నిర్మూలన నుంచి ఆధునిక సాంకేతికత వరకు అన్ని రంగాలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

పట్టణ స్థానిక సంస్థల్లో క్లీన్ స్వీప్..

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నూరు మేయర్, చైర్‌పర్సన్ పదవులకు గాను తొంభై నాలుగు స్థానాలను కైవసం చేసుకుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. పదమూడు మేయర్ పదవుల్లో పన్నెండు, ఎనభై ఏడు చైర్‌పర్సన్ పదవుల్లో ఎనభై రెండు స్థానాలను కూటమి గెలుచుకుందని తెలిపారు. మొత్తం 94 పదవుల్లో తెలుగుదేశం పార్టీ 70, జనసేన 20, బీజేపీ నాలుగు పదవులను దక్కించుకున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,941 వార్డుల్లో 3,233 వార్డులను అంటే ఏకంగా 82 శాతం స్థానాలను కూటమి గెలుచుకుందని వివరించారు. అనంతపురం మేయర్ పదవిని కోల్పోయినప్పటికీ అక్కడ ఎక్కువ మంది కార్పొరేటర్లు కూటమి తరఫునే గెలిచారని పేర్కొన్నారు. విశాఖపట్నంలో 2.47 లక్షలు, విజయవాడలో 1.30 లక్షలు, గుంటూరులో 96 వేల ఓట్ల భారీ మెజారిటీ నమోదైందని ఆయన వెల్లడించారు.

వైసీపీకి దక్కింది ఆ నాలుగే..

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 100 మేయర్, చైర్‌పర్సన్ పదవులకు గాను కేవలం నాలుగు స్థానాలకే పరిమితమైందని చంద్రబాబు తెలిపారు. 13 మేయర్ పదవుల్లో ఒక్కటి మాత్రమే గెలుచుకుందని, మొత్తం వార్డుల్లో 14.2 శాతానికే పరిమితమైందన్నారు. ఏకంగా 22 పట్టణ స్థానిక సంస్థల్లో వైసీపీకి ఒక్క వార్డు కూడా రాలేదని వివరించారు. పులివెందులలో కూటమి 13 వేలకు పైగా మెజారిటీతో చైర్‌పర్సన్ పదవిని గెలుచుకోవడంతో పాటు నలభై వార్డులకు గాను ముప్పై ఏడు స్థానాలను కైవసం చేసుకుందని తెలిపారు. కడప కార్పొరేషన్‌లో 65 వేల మెజారిటీతో విజయం సాధించామని, మొత్తం 66 వార్డుల్లో 64 స్థానాలను గెలుచుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. కడప జిల్లాలోని తొమ్మిది పట్టణ స్థానిక సంస్థలూ కూటమి ఖాతాలోకే వచ్చాయని చెప్పారు. ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం వల్లే ఈ ఫలితాలు వచ్చాయని ఆయన వ్యాఖ్యానించారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట..

తెలుగుదేశం పార్టీ నుంచి మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నికైన 70 మందిలో 42 మంది మహిళలు ఉన్నారని, ఇది 60 శాతం ప్రాతినిధ్యమని చంద్రబాబు తెలిపారు. టీడీపీ గెలిచిన పది మేయర్ పదవుల్లో ఎనిమిది పదవులను మహిళలే దక్కించుకున్నారన్నారు. టీడీపీ నుంచి ఎన్నికైన 70 మందిలో 44 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందినవారని, వీరికి 62.9 శాతం ప్రాతినిధ్యం లభించిందని చెప్పారు. వర్గాల వారీగా బీసీలకు 25, ఎస్సీలకు తొమ్మిది, మైనారిటీలకు తొమ్మిది, ఎస్టీలకు ఒక పదవి దక్కిందన్నారు. మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నికైన వారిలో తొమ్మిది మంది ముస్లిం మైనారిటీలు ఉన్నారని, వారిలో ఆరుగురు మహిళలని చెప్పారు.

విద్యావంతులు, యువతకు అవకాశాలు..

ఎన్నికైన నాయకత్వంలో యువతకు పెద్దపీట వేశామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. టీడీపీ నుంచి గెలిచిన 70 మందిలో 31 మంది నలభై ఐదేళ్లలోపు వారని, ఎనిమిది మంది ముప్పై ఐదేళ్లలోపు వారేనని తెలిపారు. పది మంది టీడీపీ మేయర్ల సగటు వయస్సు కేవలం 39 సంవత్సరాలుగా ఉందన్నారు. అలాగే టీడీపీ నుంచి మేయర్లు, చైర్‌పర్సన్లుగా ఎన్నికైన 70 మందిలో 55 మంది డిగ్రీ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉన్నారని, వీరిలో 11 మంది పీజీ చేశారని వివరించారు. ఉన్నత విద్యావంతులకు పట్టణ పాలనలో బాధ్యతలు అప్పగించామని చెప్పారు. రాజకీయాల్లో కొత్త ప్రయోగాలు ఫలితాలను ఇచ్చాయని, ఈ నాయకత్వం రాబోయే ముప్పై ఏళ్లకు సరిపోయేలా కొత్త తరానికి అవకాశాలు కల్పిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.



పోస్టల్ బ్యాలెట్‌లోనూ ఆధిక్యమే..

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా కూటమికి 65.70 శాతం, వైసీపీకి 27.42 శాతం ఓట్లు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైసీపీకి 31.43 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లు నమోదయ్యాయని వివరించారు. ఈవీఎంలతో ఎన్నికలు జరిగినప్పుడు మేనిపులేషన్ జరిగిందని, ఇప్పుడు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరిగితే రిగ్గింగ్ జరిగిందని ఆరోపించడం సరికాదన్నారు. ఓటమిపై వివాదాలు చేయడం మానుకోవాలని సూచించారు.

కరవుకు శాశ్వత పరిష్కారంగా 36 ప్రాజెక్టులు..

రాష్ట్రంలో తక్షణం అధిగమించాల్సిన సమస్య కరవు అని, రాయలసీమ ప్రాంత ప్రజల కష్టాలను తాను ప్రత్యక్షంగా చూశానని ముఖ్యమంత్రి చెప్పారు. సాగునీరు అందిస్తే రైతులు బంగారం పండిస్తారన్న నమ్మకంతో, ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు వంద కోట్లు అదనంగా కేటాయించి 32 రకాల విత్తనాలను అందించామని తెలిపారు. 35 వేల కోట్ల వ్యయంతో 36 ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తున్నామని ఆయన వెల్లడించారు. గోదావరి, కావేరి, బనకచర్ల నదుల అనుసంధానం ద్వారా నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందని, డబ్బుతో కాకుండా సేవాభావంతో రాజకీయాలు చేయాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో ఖర్చు తగ్గితే నాయకుల్లో సేవాభావం పెరుగుతుందన్నారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో కూటమి ఒక ఎంపీటీసీ స్థానాన్ని కోల్పోయిందని, వాస్తవాలను అంగీకరిస్తున్నామని చంద్రబాబు తెలిపారు.

సీఐఐ సదస్సుకు ముమ్మర ఏర్పాట్లు

- **పెట్టుబడుల వేట.. సీఐఐ సదస్సు!**
- **విశాఖలో ప్రతిష్టాత్మక ఏర్పాట్లు**
- **59 దేశాల ప్రతినిధుల రాక**
- **హాజరుకానున్న 15 మంది విదేశీ మంత్రులు**
- **సమీక్షించిన మంత్రి బాల వీరాంజనేయస్వామి**

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్): రాష్ట్ర సమగ్ర ఆర్థిక, పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. విశాఖపట్నంలో ఈ నెల 12, 13 తేదీల్లో జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై సోమవారం అమరావతి నుంచి ఆయన జూమ్ వేదికగా సమీక్షించారు. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులకు ఆయన పలు కీలక సూచనలు చేశారు.

విశాఖలో భారీ ఏర్పాట్లు..

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ మైదానంలో సీఐఐ సదస్సు కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు 59 దేశాల నుంచి ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు హాజరుకానున్నారు. దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు, సీఈవోలు, విధాన నిర్ణేతలు కలిపి 1,250 మందికి పైగా పాల్గొంటారని వివరించారు. వాణిజ్యం, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం కంప్యూటింగ్, సాంకేతిక ఆవిష్కరణలు, ఏరోస్పేస్ తయారీ తదితర ఆరు కీలక రంగాలపై సదస్సులో ప్రధానంగా చర్చలు జరుగుతాయని వెల్లడించారు.

గత పాలనలో తీవ్ర నష్టం..

గత గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో నష్టపోయిందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడానికి ఎంతగానో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.



వైద్య సేవల్లో.. పల్నాడు ఫస్ట్!

- **ప్రజాభిప్రాయాల్లో సానుకూల స్పందన**
- **అట్టడుగున కర్నూలు జిల్లా**
- **135 మందికి షోకాజ్ నోటీసులు**
- **మంత్రికి అందిన నివేదిక**



అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : ప్రభుత్వ పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల పనితీరులో పల్నాడు జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రోగుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో సేకరించిన అభిప్రాయాల్లో 81.6 శాతం సానుకూల స్పందనతో పల్నాడు మొదటి స్థానాన్ని దక్కించుకోగా.. కర్నూలు జిల్లా చిట్టచివరి స్థానంలో నిలిచింది. గత జూలై నుంచి నవంబర్ ఏడు వరకు సేకరించిన అభిప్రాయాల ఆధారంగా వైద్యారోగ్య శాఖ జిల్లాల పనితీరును అంచనా వేసింది. వైద్యుల అందుబాటు, మందుల సరఫరా, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై రోగులు వెల్లడించిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ జాబితాలో 81.5 శాతంతో పోలవరం రెండో స్థానంలో, 80.7 శాతంతో నెల్లూరు మూడో స్థానంలో నిలిచాయి. తిరుపతి, కృష్ణా జిల్లాలు నాలుగు, ఐదు స్థానాలను సాధించాయి. కర్నూలు, అనంతపురం, ఎన్టీఆర్, అనకాపల్లి, మార్కాపురం వెనుకబడిన జాబితాలో ఉన్నాయి.

135 మంది వైద్యులకు నోటీసులు..

అక్టోబరు నెలలో వైద్యుల అందుబాటు, పారిశుద్ధ్యం, వైద్యానికి డబ్బులు అడగటం, మందులు ఇవ్వడం అనే నాలుగు అంశాలపై రోగుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ నాలుగు అంశాల్లోనూ నూరు శాతం ప్రతికూల సమాధానాలు నమోదైన 135 మంది వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ ఆర్.వెంకటరమణ వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు నివేదిక సమర్పించారు. వైద్య సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు ఐవీఆర్ఎస్ నివేదికల ఆధారంగా ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నారు.

ఉత్తమ, వెనుకబడిన పీహెచ్‌సీలు..

అక్టోబరులో ఉత్తమ పనితీరు కనబరిచిన తొలి ఇరవై ఆరోగ్య కేంద్రాల్లో అనంతపురం జిల్లా నుంచి ఐదు, నెల్లూరు నుంచి రెండు, ఏలూరు నుంచి రెండు, తిరుపతి నుంచి మూడు, తూర్పుగోదావరి నుంచి రెండు పీహెచ్‌సీలు చోటు దక్కించుకున్నాయి. ఇక పనితీరులో వెనుకబడిన కేంద్రాల్లో అనంతపురం జిల్లాలోని గరుడచేడు, జంగాల కాలనీ, నంద్యాల జిల్లాలోని బెయిర్లుటి, వైఎస్సార్ కడప జిల్లాలోని దువ్వూరు, శ్రీ సత్యసాయి జిల్లాలోని వెంకలమ్మ చెరువు పీహెచ్‌సీలు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది.

ఓటమిపై రిపోర్ట్!

- జగన్‌కు చేరిన రహస్య నివేదిక?
- బయటపడిన ఆరు విషయాలు
- ప్రచారానికే పరిమితమైన నేతలు
- ప్రత్యర్థులతో ఒప్పందాలు
- మార్పులు చేయకుంటే 2029లో దెబ్బే!

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొన్న ఘోర పరాజయానికి గల కారణాలపై ఆ పార్టీలో తీవ్రస్థాయిలో అంతర్గత చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ముగ్గురు ఐఐటీ గ్రాడ్యుయేట్లు వైసీపీ రాజకీయ పరిస్థితులను లోతుగా విశ్లేషించి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓ రహస్య నివేదిక అందించినట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ నివేదిక అందినట్లు గానీ, అందులోని అంశాలు అధికారికంగా ధ్రువీకరించినట్లు గానీ పార్టీ నుంచి ఎలాంటి సమాచారం లేదు. పార్టీ అధినేతకు అందినట్లు చెబుతున్న ఈ నివేదికలో వైసీపీ ఓటమికి సంబంధించి ఆరు ప్రధాన అంశాలను ప్రస్తావించినట్లు కథనాలు వెలువడుతున్నాయి. ప్రధానంగా 111 మంది నియోజకవర్గ ఇన్‌చార్జిలు స్థానిక సంస్థల ఎన్నికలను తగినంత ప్రాధాన్యంతో తీసుకోలేదని ఆ నివేదిక విశ్లేషించినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో నేతలు గైర్హాజరై, స్వయంగా ప్రజల్లోకి వెళ్లి పోరాటాలు చేయకుండా కార్యకర్తలపైనే మొత్తం బాధ్యతలు వదిలేశారన్నది ప్రధాన ఆరోపణ. అంతేకాకుండా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు పార్టీ నాయకత్వం నుంచి కనీస సహకారం, భరోసా కూడా అందలేదన్న విమర్శలు ఆ నివేదికలో ఉన్నట్లు తెలుస్తోంది.

అధికార పార్టీ నేతలతో చీకటి ఒప్పందాలు!

ప్రజా సమస్యలపై పోరాటం కంటే కేవలం ప్రచార హంగామా, రాజకీయ ప్రదర్శనలకే నేతలు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని ముగ్గురు గ్రాడ్యుయేట్ల నివేదిక కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. నిరసనలు, సెల్ఫీ వీడియోలు, హౌస్ అరెస్టుల ప్రచారానికే పరిమితమయ్యారని విశ్లేషించినట్లు తెలుస్తోంది. వీటన్నింటికీ మించి.. వైసీపీకి చెందిన కొందరు నేతలు రాత్రి వేళల్లో ఏకంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలతో రహస్య సంప్రదింపులు జరుపుతున్నారనే తీవ్రస్థాయి ఆరోపణలు కూడా ఈ నివేదికలో పొందుపరిచినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.



నివేదికపై జగన్ నిర్ణయం ఏంటి?

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 111 మంది నియోజకవర్గ ఇన్‌చార్జిల పనితీరును తక్షణమే సమీక్షించి, అవసరమైన ప్రక్షాళన చేపట్టకపోతే 2029 సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరింత రాజకీయ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆ నివేదిక తీవ్రంగా హెచ్చరించినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గ ఇన్‌చార్జిలను మారుస్తారా? పార్టీలో సంస్థాగత ప్రక్షాళనకు శ్రీకారం చుడతారా? 2029 ఎన్నికలే లక్ష్యంగా వైసీపీలో సమూల మార్పులు తీసుకువస్తారా? అన్న అంశాలపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

పెట్టుబడుల మహా వేదిక!

- విశాఖలో 31వ సీఐఐ సదస్సు
- వాణిజ్యం నుంచి క్వాంటం వరకు చర్చలు
- 58 దేశాల పారిశ్రామికవేత్తల రాక
- ఇప్పటికే 86 వేల కోట్ల ఒప్పందాలు
- హాజరుకానున్న చంద్రబాబు, అమిత్ షా



అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్): రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నూతన దశదిశను నిర్దేశిస్తూ.. 'నేవిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్' థీమ్‌తో విశాఖ వేదికగా ఈ నెల 12, 13వ తేదీల్లో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు ఈ పెట్టుబడుల సదస్సు అద్దం పట్టనుంది. కేవలం పెట్టుబడుల ఆకర్షణకే పరిమితం కాకుండా వాణిజ్యం నుంచి క్వాంటం వరకు వివిధ అంశాలపై మేధోమథనం నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్రమంత్రులు, అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలు ఈ సదస్సుకు హాజరు కానున్నారు.

58 దేశాల నుంచి ప్రతినిధులు..

దాదాపు 58 దేశాలకు చెందిన ప్రభుత్వ, పారిశ్రామిక ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ఇప్పటికే తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమల్ని అనుసంధానించడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీతో కలిసి భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఈ సదస్సును నిర్వహిస్తోంది. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సమ్మిట్‌కు అధ్యక్షత వహించనుండగా, సీఎం చంద్రబాబు నాయుడు సహాధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. 16 మంది విదేశీ మంత్రులతో పాటు సింగపూర్, నేపాల్, యూఏఈ, కెనడా తదితర దేశాల ప్రభుత్వ ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారు. ఈ సందర్భంగా 400 పైచిలుకు బిజినెస్ టు బిజినెస్ (బీ టూ బీ), ప్రభుత్వాలతో పరిశ్రమల సంప్రదింపుల కోసం బీ టూ జీ సమావేశాలు కూడా జరగనున్నాయి.

ఆరు లక్షల కోట్ల ప్రాజెక్టులు..

గత పెట్టుబడుల సదస్సులో జరిగిన ఒప్పందాలను ప్రాజెక్టులుగా మలిచేందుకు మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో అధికారుల కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 6 లక్షల కోట్ల విలువైన 272 ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. మరో 17 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2025-26లో దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఏపీ 25.6 శాతం దక్కించుకోవడం విశేషం. కాగా, ఈ సీఐఐ సదస్సులో భాగంగా నిర్వహించిన ఆరు ప్రాంతీయ సదస్సుల ద్వారా 194 ఎంఓయూలు కుదరగా.. 86,522 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. దీని ద్వారా సుమారు 1.47 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

రేపే సీఎం విందు..

ఈ పెట్టుబడుల సదస్సులో భాగంగా 11వ తేదీన పారిశ్రామిక ప్రతినిధుల మధ్య ముందస్తు సమావేశాలు జరగనుండగా.. అదే రోజు రాత్రి 8 గంటలకు సీఎం చంద్రబాబు అధికారిక విందు ఇవ్వనున్నారు. విశాఖలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్స్‌లో 12, 13 తేదీల్లో ప్రధాన సమావేశం నిర్వహిస్తారు. దీనికి సమాంతరంగా ఏపీ ఉమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్-2026 కూడా నిర్వహిస్తారు. 13వ తేదీ సాయంత్రం 4 గంటలకు జరిగే ముగింపు కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ పాల్గొననున్నారు.

నేటి నుంచి హెచ్‌ఆర్‌సీ కోర్టులు!

విజయవాడ వేదికగా క్యాంపు కోర్టు

నేటి నుంచి 13వ తేదీ వరకు నిర్వహణ

నాలుగు జిల్లాల కేసుల విచారణ

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విజయవాడ, నవంబర్ 9 (సమయం న్యూస్) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న క్యాంపు కోర్టులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. హెచ్‌ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ క్యాంపు కోర్టు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు క్యాంప్ కోర్టు నోడల్ అధికారి బొగ్గరం తారక నరసింహ కుమార్ ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఈ క్యాంపు కోర్టులో ప్రధానంగా ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమగోదావరి (భీమవరం) జిల్లాలకు సంబంధించిన కేసుల విచారణ జరగనుంది. పెండింగ్ కేసుల విచారణతో పాటు నూతన కేసుల స్వీకరణ కార్యక్రమాలు కూడా చేపట్టనున్నట్లు నోడల్ అధికారి తెలిపారు. ఈ నాలుగు జిల్లాల పరిధిలోని ప్రజలు ఈ క్యాంపు కోర్టు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే హెచ్‌ఆర్సీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించి ఆయా జిల్లాల అధికారులు కూడా విధిగా ఈ క్యాంపు కోర్టుకు హాజరుకావాలని అధికారులు సూచించారు.

మురసుతో భారీ నష్టం

- దెబ్బతిన్న 1,302 కిలోమీటర్ల రోడ్లు
- అత్యధికంగా బాపట్ల జిల్లాలో విలయం
- పునరుద్ధరణకు 871 కోట్ల నిధులు
- అంచనాలు వెల్లడించిన మంత్రి జనార్థన్ రెడ్డి



అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : రాష్ట్రంలో మురసు తీవ్ర తుఫాను సృష్టించిన బీభత్సానికి రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బీ) శాఖకు భారీ నష్టం వాటిల్లింది. తుఫాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 1,302 కిలోమీటర్ల మేర రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయని మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి వెల్లడించారు. రోడ్ల తాత్కాలిక, శాశ్వత పునరుద్ధరణ పనులకు ప్రాథమికంగా రూ.870.90 కోట్లు వ్యయం అవుతుందని ఆయన ఒక ప్రకటనలో అంచనా వేశారు.

బాపట్లలో అత్యధికం..

మురసు తుఫాను కారణంగా రాష్ట్రంలోని పది జిల్లాల్లో రహదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అత్యధికంగా బాపట్ల జిల్లాలో 332 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం కాగా.. గుంటూరులో 266, ఎన్టీఆర్ జిల్లాలో 202, పశ్చిమగోదావరిలో 122 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి, నెల్లూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లోనూ భారీగా రహదారులు దెబ్బతిన్నట్లు మంత్రి వివరించారు. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులను అధికారులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 158 చోట్ల రోడ్లు కోతకు గురికాగా ఇప్పటికే 141 చోట్ల పనులు పూర్తి చేశారు. 31 చోట్ల రోడ్లు కొట్టుకుపోగా.. 30 చోట్ల తాత్కాలికంగా పునరుద్ధరించారు. దెబ్బతిన్న సీడీ వర్క్ పనులను దాదాపుగా పూర్తి చేశారు. రహదారులపై 207 చోట్ల విరిగిపడిన చెట్లను పూర్తిగా తొలగించి రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. వరదల కారణంగా తూర్పుగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని నాలుగు ప్రాంతాల్లో మినహా మిగిలిన 116 చోట్లా ట్రాఫిక్ ఇబ్బందులను వెంటనే తొలగించారు.

కోట్లలో నిధుల అవసరం..

తుఫాను కారణంగా ధ్వంసమైన రహదారుల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ.98.70 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దెబ్బతిన్న రోడ్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించేందుకు మరో రూ.772.22 కోట్లు అవసరమవుతాయని తేల్చారు. మొత్తంగా ఆర్ అండ్ బీ రహదారులను మునుపటి స్థితికి తీసుకురావడానికి రూ.870.90 కోట్లు వ్యయం అవుతుందని మంత్రి జనార్థన్ రెడ్డి స్పష్టం చేశారు.

గొర్రెతోలు కప్పుకున్న తోడేలు

చంద్రబాబుపై జగన్ ఫైర్!

రిగ్గింగ్ మాస్టర్ పేరుతో హ్యాష్‌ట్యాగ్

సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యంగా మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'రిగ్గింగ్ మాస్టర్ చంద్రబాబు' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జత చేస్తూ ఆయన సోషల్ మీడియాలో చేసిన తాజా ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుపడుతూ.. గొర్రెతోలు కప్పుకున్న తోడేలుకు, ఆయనకు మధ్య ఎలాంటి తేడా లేదని జగన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలపై చంద్రబాబు మాట్లాడుతుండటం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రిగ్గింగ్ మాస్టర్‌గా పేరుగాంచిన వ్యక్తి.. నేడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెబుతుంటే రాష్ట్ర ప్రజలు ఆశ్చర్యపోతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఆవేదన వ్యక్తం చేస్తూ.. "హే రామ్.. సేవ్ ఆంధ్రా..!!" అంటూ జగన్ తన ట్వీట్‌లో ముగించారు.



వడ్డీతో సహా.. తీర్చేస్తాం!

అక్రమ కేసులన్నీ మాకు బాకీలే.. కూటమి నేతలకు అంబటి వార్నింగ్

తిరిగి వచ్చాక ఎవరినీ వదలం.. వైసీపీ కేడర్ ఊరుకునే ప్రసక్తే లేదు

గుంటూరు జైలులో అప్పిరెడ్డికి పరామర్శ

గుంటూరు, నవంబర్ 9 (సమయం న్యూస్): అక్రమ కేసుల పేరుతో తమను వేధిస్తున్నారని, అవన్నీ తమకు బాకీలేనని, తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత వడ్డీతో సహా తీర్చేస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పార్టీ నేత లేళ్ల అప్పిరెడ్డిని ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని ప్రశ్నించిన పాపానికి వైసీపీ నేత అప్పిరెడ్డిని అకారణంగా అరెస్ట్ చేసి జైలుకు పంపారని అంబటి మండిపడ్డారు. కూటమి నేతలు ఉద్దేశపూర్వకంగానే తమపై దాడులు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. తాను 1989 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, గుంటూరులో ఇలాంటి దుష్ట సంప్రదాయాన్ని ఎప్పుడూ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు కేసులతో కొత్త సంస్కృతికి తెరలేపారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము సైలెంట్‌గా ఉన్నా.. తమ పార్టీ కేడర్ మాత్రం ఈ అక్రమాలను ఎంతమాత్రం సహించదని ఆయన స్పష్టం చేశారు. తమపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులన్నీ బాకీల కిందే లెక్క అని.. తిరిగి అధికారంలోకి రాగానే వాటన్నింటినీ తీర్చేస్తామని అంబటి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు.



ఆ దుస్తులతో.. బయట తిరగొద్దు!

ఓటీ, ఐసీయూలకే ప్రత్యేక దుస్తులు..ఇతర ప్రాంతాల్లో నిషేధం

సూపరింటెండెంట్లకు డీఎంఈ ఆదేశాలు

తొలిసారిగా లిఖితపూర్వక ఉత్తర్వులు

అమరావతి, నవంబర్ 9 (సమయం న్యూస్): ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో రోగులకు అంటువ్యాధులు వ్యాపించకుండా ఇన్ఫెక్షన్ల నియంత్రణపై వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆపరేషన్ థియేటర్లు (ఓటీ), అత్యవసర చికిత్స విభాగాల్లో (ఐసీయూ) విధులు నిర్వహించే వైద్యులు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్‌లు, నర్సింగ్ ఇతర సిబ్బంది అక్కడి ప్రత్యేక దుస్తులను నిర్దేశిత ప్రాంతాలకే పరిమితం చేయాలని స్పష్టం చేశారు. విధులు ముగిసిన తర్వాత అదే దుస్తులతో ఆస్పత్రిలోని ఇతర ప్రాంతాల్లో తిరగకూడదని సూపరింటెండెంట్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఓటీ, ఐసీయూల్లో ఉపయోగించే దుస్తులతో బయట తిరగడం వల్ల సూక్ష్మజీవులు సులభంగా వ్యాపిస్తాయని, దీనివల్ల ఇతర ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు మౌఖికంగా ఉన్న ఈ కీలక నిబంధనపై తొలిసారిగా లిఖితపూర్వకంగా ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. తాజా ఆదేశాల ప్రకారం.. ఆపరేషన్ థియేటర్ సముదాయాలు, అన్ని ఐసీయూలు, ప్రసవ గదులు, క్యాథ్ ల్యాబ్‌లు, మార్పిడి చికిత్స విభాగాలు, సీసీఎస్‌డీ స్టెరైల్ జోన్‌లలో మాత్రమే ఆ ప్రత్యేక దుస్తులు ధరించాలి. ఆ దుస్తులతో సాధారణ వార్డులు, ఓపీడీలు, కారిడార్లు, లిఫ్టులు, కార్యాలయాలు, గ్రంథాలయాలు, క్యాంటీన్లు, వసతి గృహాలు, వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్ స్థలాలతో పాటు ఆసుపత్రి ప్రాంగణం వెలుపల అస్సలు తిరగకూడదు. నిర్దేశిత ప్రాంతాల్లోకి ప్రవేశించే సమయంలో మాత్రమే ప్రత్యేక దుస్తులు ధరించాలని, బయటకు వచ్చేటప్పుడు వాటిని కచ్చితంగా తొలగించాలని డీఎంఈ స్పష్టం చేశారు. టోపీలు, మాస్కులు, షూ కవర్లను బయటకు వెళ్లే ముందే తీసేయాలి. ఓటీ, ఐసీయూలకు కేటాయించిన పాదరక్షలను ఇతర ప్రాంతాల్లో ఉపయోగించకూడదు. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే.. ఆ ప్రత్యేక దుస్తులపై శరీరాన్ని పూర్తిగా కప్పే శుభ్రమైన గౌన్ లేదా కోటు ధరించాలి. తిరిగి లోపలికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా కొత్త ప్రత్యేక దుస్తులు వేసుకోవాలి. సిబ్బందికి తగిన సంఖ్యలో ప్రత్యేక దుస్తులను అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ఆసుపత్రి పర్యవేక్షకులదేనని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఓటీ, ఐసీయూలకు వేర్వేరు రంగుల దుస్తులు కేటాయించాలని సూచించారు. ఈ దుస్తులను బయట కాకుండా ఆసుపత్రి లాండ్రీ ద్వారానే శుభ్రం చేయించాలి. ప్రతి ఓటీ, ఐసీయూ ప్రవేశద్వారం వద్ద పురుషులు, మహిళలకు వేర్వేరుగా దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నూతన ఆదేశాల అమలుకు ప్రతి బోధనాసుపత్రి సూపరింటెండెంట్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్నదానిపై ఇన్ఫెక్షన్ నియంత్రణ కమిటీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఉల్లంఘనలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. ఎవరైనా మొదటిసారి నిబంధనలు ఉల్లంఘిస్తే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఆ ఘటనను రికార్డుల్లో నమోదు చేయాలి. అలాకాకుండా పదేపదే ఉల్లంఘిస్తే విషయాన్ని ప్రిన్సిపాల్ లేదా సూపరింటెండెంట్‌కు నివేదించి నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డీఎంఈ విష్ణువర్ధన్ ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



సంపాదకీయం



ఓడిన ట్రంప్..

ఇరాన్‌పై దూకుడు తగ్గేనా?

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లకు భారీ ఎదురుదెబ్బ

కాంగ్రెస్ ఉభయ సభల్లో డెమోక్రాట్ల ఆధిపత్యానికి మార్గం

జనవరి వరకు ట్రంప్‌నకు రెండు నెలల కీలక అవకాశం

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురైన భారీ పరాజయం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ భవిష్యత్తుతోపాటు ఆయన విదేశాంగ విధానంపైనా ప్రభావం చూపనుందా? ముఖ్యంగా ఇరాన్‌పై ఇప్పటివరకు అనుసరిస్తున్న కఠిన వైఖరిని కొనసాగిస్తారా? లేక కాంగ్రెస్‌లో మారనున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో దూకుడు తగ్గించి దౌత్య చర్చలకు ప్రాధాన్యం ఇస్తారా? అన్న ప్రశ్నలు అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనెట్‌లో ఆధిక్యం సాధించడంతో రానున్న రెండేళ్లలో ట్రంప్ ప్రభుత్వానికి కాంగ్రెస్ నుంచి గట్టి పర్యవేక్షణ ఎదురయ్యే అవకాశముంది. అయితే కొత్తగా ఎన్నికైన సభ్యులు 2027 జనవరిలో బాధ్యతలు చేపట్టే వరకు ప్రస్తుత కాంగ్రెస్ కొనసాగనుంది. దీంతో ఈ రెండు నెలల వ్యవధిలో ట్రంప్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. అమెరికా రాజకీయ వ్యవస్థలో ఎన్నికలు ముగిసినప్పటికీ కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టే వరకు ఉండే మధ్యంతర కాలాన్ని 'లేమ్ డక్' కాలంగా వ్యవహరిస్తారు. ఈ సమయంలో పాత కాంగ్రెస్ తన అధికారాలను కొనసాగిస్తుంది. నవంబర్‌లో ఎన్నికలు జరిగినా కొత్త కాంగ్రెస్ జనవరి 3న సమావేశమవుతుంది. అప్పటివరకు ప్రస్తుత సభ్యులకే శాసన అధికారాలు ఉంటాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం తన ప్రాధాన్య కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించే అవకాశముంది. అయితే కొత్త కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత బడ్జెట్, ప్రభుత్వ వ్యయాలు, అధికారుల విచారణలు, శాసనపరమైన అంశాల్లో డెమోక్రాట్ల పాత్ర కీలకంగా మారనుంది.

ట్రంప్ ఎదుట ఇరాన్ సవాల్

ఇరాన్‌తో అమెరికా సంబంధాలు ఇప్పటికే తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగుతున్నాయి. ఇరాన్ అణు కార్యక్రమం, ప్రాంతీయ భద్రత, గల్ఫ్ దేశాల ప్రయోజనాలు, అంతర్జాతీయ చమురు రవాణా వంటి అంశాలు అమెరికా విదేశాంగ విధానంలో కీలకంగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ట్రంప్ ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని కొనసాగిస్తారా? లేక దౌత్యపరమైన పరిష్కారానికి ప్రయత్నిస్తారా? అన్నది ప్రధాన ప్రశ్నగా మారింది. ఇరాన్‌పై మరింత సైనిక చర్య చేపట్టడం ఒక అవకాశంగా కొందరు విశ్లేషకులు ప్రస్తావిస్తున్నప్పటికీ, అలాంటి నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక ధ్రువీకరణ లేదు. అంతేకాకుండా సైనిక చర్యలు విస్తరిస్తే పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదముంది. ఇరాన్‌పై అమెరికా దాడులు తీవ్రతరం చేస్తే టెహ్రాన్ ప్రతిస్పందన ఎలా ఉంటుందన్నది కూడా కీలకమే. గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలు, మిత్రదేశాల భద్రత, చమురు రవాణా మార్గాలపై ప్రభావం పడే అవకాశాలను అమెరికా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి ద్వారా జరిగే చమురు రవాణాకు అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపవచ్చు. మరోవైపు మధ్యంతర ఎన్నికల ఫలితాలను ఇరాన్ తనకు రాజకీయంగా అనుకూలమైన పరిణామంగా భావించే అవకాశమున్నప్పటికీ, ఆ కారణంగానే చర్చల్లో ఎలాంటి రాయితీలు ఇవ్వబోదని నిర్ధారించలేం. ఇరు దేశాల తదుపరి చర్యలపైనే పరిస్థితి ఆధారపడి ఉంటుంది. ఇరాన్‌పై అత్యంత శక్తిమంతమైన సంప్రదాయ బాంబులు లేదా అణ్వాయుధాల వినియోగం గురించి కొన్ని విశ్లేషణల్లో తీవ్రమైన అవకాశాలు ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే అణ్వాయుధ దాడికి అమెరికా సిద్ధమవుతోందని నిర్ధారించే అధికారిక ఆధారాలు లేవు. అలాంటి చర్య అంతర్జాతీయంగా తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుంది. అందువల్ల సైనిక చర్యలపై వస్తున్న ఊహాగానాలను అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలుగా పరిగణించరాదు. ఇరాన్‌తోపాటు క్యూబా విషయంలోనూ ట్రంప్ ప్రభుత్వం ఎలాంటి వైఖరి అవలంబిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హయాంలో క్యూబాతో సంబంధాలను మెరుగుపరిచేందుకు అమెరికా ప్రయత్నించింది. అయితే ట్రంప్ విధానాలు అందుకు భిన్నంగా సాగాయి. ఆర్థిక సంక్షోభంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్యూబాపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తారా? లేక ఆర్థిక ఒప్పందాల ద్వారా తన ప్రయోజనాలను సాధించేందుకు ప్రయత్నిస్తారా? అన్నది చూడాల్సి ఉంది. క్యూబాలో పాలన మార్పు లక్ష్యంగా అమెరికా సైనిక చర్య చేపడుతుందనే ఊహాగానాలు ఉన్నప్పటికీ, అలాంటి నిర్ణయానికి సంబంధించి స్పష్టమైన అధికారిక సమాచారం లేదు. ఆర్థిక ఆంక్షలు, దౌత్య ఒత్తిడి, పరిమిత చర్యలు వంటి మార్గాలు కూడా అమెరికా ముందున్నాయి. డెమోక్రాట్లు కాంగ్రెస్‌లో ఆధిపత్యం సాధించినంత మాత్రాన అధ్యక్షుడి విదేశాంగ అధికారాలన్నీ రద్దవుతాయని భావించలేం. అమెరికా అధ్యక్షుడికి విదేశాంగ విధానం, సైనిక వ్యవహారాల్లో గణనీయమైన అధికారాలు ఉన్నాయి. అయితే యుద్ధానికి సంబంధించిన నిధుల కేటాయింపు, ప్రభుత్వ వ్యయాల ఆమోదం, అధికారుల నుంచి వివరణలు కోరడం, విచారణలు చేపట్టడం వంటి అంశాల్లో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించగలదు. దీంతో కొత్త కాంగ్రెస్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ట్రంప్ నిర్ణయాలపై ప్రశ్నలు, విచారణలు పెరిగే అవకాశముంది. ముఖ్యంగా ఇరాన్‌తో ఘర్షణ, సైనిక వ్యయం, విదేశీ జోక్యాలపై డెమోక్రాట్లు మరింత కఠినంగా వ్యవహరించవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. మధ్యంతర ఎన్నికల ఫలితాలు ట్రంప్ ప్రభుత్వానికి రాజకీయంగా ప్రతికూల పరిస్థితులను సృష్టించినప్పటికీ, విదేశాంగ విధానంలో ఆయన తదుపరి నిర్ణయాలను ఇప్పుడే అంచనా వేయడం కష్టం. సైనిక ఒత్తిడిని కొనసాగించడం, పరిమిత చర్యలకు దిగడం, చర్చల ద్వారా ఒప్పందాలకు ప్రయత్నించడం వంటి మార్గాలు అమెరికా ముందున్నాయి. మొత్తానికి మధ్యంతర ఎన్నికల్లో ఎదురైన పరాజయం ట్రంప్ రాజకీయ అధికారాలకు కొత్త సవాళ్లు విసిరింది. అయితే ఈ పరిణామం ఇరాన్‌పై అమెరికా దూకుడును తగ్గిస్తుందా? లేక మరింత కఠినమైన నిర్ణయాలకు దారితీస్తుందా? అన్నది రానున్న రెండు నెలల్లో ట్రంప్ అనుసరించే విధానంపైనే ఆధారపడి ఉంటుంది.

క్యాన్సర్ రోగులకు భారీ ఊరట!

- ఔషధాల ధరలకు గరిష్టంగా 96.45 శాతం వరకు కోత
- 137 రకాల మందులకు చెందిన 1,031 ఫార్ములేషన్ల ధరల సవరణ
- క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్రం చర్యలు
- దేశవ్యాప్తంగా సవరించిన ధరలు అమల్లోకి వచ్చినట్లు ప్రకటన
- కొత్త గరిష్ట చిల్లర ధరల ప్రకారమే మందులు విక్రయించాలని ఆదేశాలు
- మందుల ధరల వివరాలు ఎన్‌పీపీఏ వెబ్‌సైట్‌లో అందుబాటులో



న్యూఢిల్లీ, నవంబర్ 9 (సమయం న్యూస్): క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న రోగులకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించే నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే పలు ఔషధాల ధరలను గణనీయంగా తగ్గిస్తూ జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) ధరల సవరణను ప్రకటించినట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రకారం 137 రకాల ఔషధాలకు సంబంధించిన 1,031 ఫార్ములేషన్ల ధరలు గరిష్టంగా 96.45 శాతం వరకు తగ్గనున్నాయి. ఖరీదైన మందుల కొనుగోలుతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్యాన్సర్ రోగులు, వారి కుటుంబాలకు ఈ చర్య ఉపశమనం కలిగించే అవకాశముంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే మందుల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఔషధ విభాగం పరిధిలోని ఎన్‌పీపీఏ ధరల సవరణకు చర్యలు చేపట్టినట్లు వెల్లడైంది. మొత్తం 137 రకాల ఔషధాలకు సంబంధించిన 1,031 ఫార్ములేషన్లపై ధరల సవరణ వర్తించనున్నట్లు పేర్కొన్నారు. వీటిలో కొన్ని ఔషధాల ధరలు గరిష్టంగా 96.45 శాతం వరకు తగ్గే అవకాశముంది. అయితే అన్ని మందుల ధరలు ఒకే శాతంలో తగ్గవని, ఒక్కో ఔషధానికి సవరించిన ధర వేర్వేరుగా ఉంటుందని గుర్తించాలి. క్యాన్సర్ చికిత్సలో మందుల ఖర్చు అనేక కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారంగా మారుతోంది. దీర్ఘకాలం పాటు చికిత్స అవసరమయ్యే రోగులు ఔషధాల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో మందుల ధరలు తగ్గడం వల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశముంది. చికిత్స ఖర్చులను తగ్గించడంలో ఈ నిర్ణయం కీలకంగా మారవచ్చని భావిస్తున్నారు. సవరించిన ధరలు దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చినట్లు ఎన్‌పీపీఏ వెల్లడించిందని సమాచారం. సంబంధిత ఔషధాలను నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకు మించి విక్రయించరాదని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. మందుల దుకాణాలు, ఆసుపత్రులు, ఔషధ విక్రయ సంస్థలు అమల్లో ఉన్న ధరల నియంత్రణ ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. సవరించిన ధరల అమలు తేదీ, పాత నిల్వలపై వర్తించే నిబంధనలను సంబంధిత అధికారిక ఉత్తర్వుల ప్రకారం పరిశీలించాలి. క్యాన్సర్ రోగులు, వారి కుటుంబ సభ్యులు మందులు కొనుగోలు చేసే సమయంలో ఔషధం పేరు, మోతాదు, తయారీ సంస్థ, గరిష్ట చిల్లర ధరలను పరిశీలించడం అవసరం. ముఖ్యంగా ధరల సవరణ వర్తించే మందుల జాబితాలో తాము వినియోగిస్తున్న ఔషధం ఉందో లేదో తెలుసుకోవాలి. సవరించిన ధరల వివరాలను ఎన్‌పీపీఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారా పరిశీలించవచ్చు. క్యాన్సర్ చికిత్సలో వైద్యసేవలతోపాటు ఔషధాల లభ్యత, వాటి ధరలు కూడా అత్యంత కీలకమైన అంశాలు. ఖరీదైన మందులు అందుబాటు ధరల్లో లభిస్తే రోగులకు చికిత్స కొనసాగించడం కొంత సులభమవుతుంది. ఔషధాల ధరల నియంత్రణ ద్వారా వైద్య ఖర్చులను తగ్గించే చర్యలు రోగుల సంక్షేమానికి దోహదపడే అవకాశముంది.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ కసరత్తు

జనవరిలో మోగనున్న నగారా!



ఢిల్లీ, నవంబర్ 9: దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్ది రోజుల్లో నగారా మోగనుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) కసరత్తు చేపట్టింది. జనవరి మాసం ప్రథమ, ద్వితీయార్ధంలో ఈ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఫిబ్రవరి – మార్చి మాసాల్లో పోలింగ్ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్, ఈవీఎంల తనిఖీలను ఎన్నికల సంఘం (ఈసీ) వేగవంతం చేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే ఈ రాష్ట్రాల్లో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు జోరందుకున్నాయి. ఇక ఎన్నికల షెడ్యూల్ సంకేతాలతో ఆయా రాష్ట్రాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అయితే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపుర్‌లలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలని బీజేపీ పట్టుదలతో ఉంది. ఇక పంజాబ్‌లో మళ్లీ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన వంతు ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా పుంజుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. మరో వైపు ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలోని 403 సీట్లపైనే అందరి దృష్టి ఉంది. ఈ ఫలితాలు దేశ రాజధాని ఢిల్లీ రాజకీయాలను శాసిస్తాయనే చర్చ సాగుతోంది.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు ఆరుగురు సజీవదహనం!


యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం



ముజఫర్‌నగర్, నవంబర్ 9 (సమయం న్యూస్): ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా తితావి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత ఘోరమైన రోడ్డు ప్రమాదం సంభవించింది. పానిపట్-ఖతిమా జాతీయ రహదారిపై జాగేహేడి సమీపంలో అతివేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని, డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు కారు తలకిందులై వాహనంలో క్షణాల్లో భయంకరమైన మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు బయటకు వచ్చే అవకాశం కూడా లేకపోవడంతో వాహనం ఆవరణలోనే చిక్కుకుని సజీవదహనమయ్యారు. హరియాణా నుంచి హరిద్వార్ వైపు ప్రయాణిస్తున్న సమయంలో తెల్లవారుజామున ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అతివేగమే ప్రమాదానికి ప్రధాన కారణమని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఢీకొట్టిన వెంటనే కారు ఫ్యూయల్ ట్యాంక్ పగిలిపోవడంతో మంటలు క్షణాల్లో కారు మొత్తాన్ని చుట్టుముట్టాయని పోలీసులు భావిస్తున్నారు. మంటల తీవ్రత ఎంతగా ఉందంటే.. కారులో ఉన్నవారంతా గుర్తుపట్టలేని రీతిలో పూర్తిగా కాలి బూడిదయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అధికారులకు సమాచారం అందించగా, పోలీసులు, ఫైర్ బ్రిగేడ్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కారులో కాలిపోయిన స్థితిలో ఉన్న ఆరుగురి మృతదేహాలను వెలికితీసి, పోస్టుమార్టం నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఫోరెన్సిక్ బృందం కూడా ప్రమాద స్థలాన్ని సందర్శించి నమూనాలు సేకరించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ముజఫర్‌నగర్ పోలీసులు మృతుల వివరాలను పూర్తిగా గుర్తించే పనిలో ఉన్నారు.

రాజకీయాలకు అతీతంగా నా ఆత్మకథ

- 'ప్రేమ, విధేయతే జీవిత ప్రయాణానికి ఆధారం'
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో పుస్తకం
- కుటుంబ అనుబంధాలు, వ్యక్తిగత అనుభవాలకు ప్రాధాన్యం
- ప్రజాస్వామ్య వ్యవస్థలకు గత 12 ఏళ్లలో నష్టం జరిగిందని వ్యాఖ్య
- బీజేపీ, ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సిందేమీ లేదన్న సోనియా



న్యూఢిల్లీ, నవంబర్ 9: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తన రాబోయే ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. ఇది రాజకీయ అంశాలతో కూడిన పుస్తకం కాదని, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుభవాలు, కుటుంబ అనుబంధాలు, ప్రేమ, విధేయత వంటి అంశాలే ఇందులో ప్రధానంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఓ జాతీయ దినపత్రికలో రాసిన వ్యాసంలో ఆమె ఈ విషయాలను పంచుకున్నారు. తన జీవితంలో చాలా వరకు వ్యక్తిగత విషయాలను బయటకు వెల్లడించలేదని సోనియా గాంధీ తెలిపారు. బహిరంగ జీవితంలోకి వచ్చిన తర్వాత కూడా సాధ్యమైనంత వరకు గోప్యతను కాపాడుకున్నానని పేర్కొన్నారు. తన జీవితాన్ని బహిరంగంగా అక్షరబద్ధం చేయాలనే ఆలోచన ఒకప్పుడు ఊహకు కూడా అందనిదిగా ఉండేదన్నారు. అయితే రాజకీయ, ప్రజా జీవితంలోని రోజువారీ హడావిడి నుంచి కొంత దూరమైన తర్వాత గతాన్ని నెమరువేసుకునే అవకాశం లభించిందని వివరించారు. తన జీవితాన్ని వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు అన్ని అనుభవాలను కలిపే ప్రధాన అంశం ప్రేమ, దాని నుంచి పుట్టిన విధేయత అని సోనియా గాంధీ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లో ఓ చిన్న ఇటాలియన్ పట్టణానికి చెందిన 19 ఏళ్ల యువతిగా ఉన్నప్పుడు భారతీయ విద్యార్థిని కలవడంతో తన జీవిత ప్రయాణం కొత్త మలుపు తిరిగిందని గుర్తుచేసుకున్నారు. ఆ పరిచయం తనను కొత్త దేశానికి, కొత్త కుటుంబానికి తీసుకెళ్లిందన్నారు. అత్తగారితో ఏర్పడిన గాఢమైన అనుబంధం, పిల్లలను పెంచిన రోజులు తన జీవితంలో మరపురాని భాగాలని తెలిపారు. తన కుటుంబం గురించి ఇప్పటికే అనేక విషయాలు ప్రచురితమయ్యాయని, అయితే కుటుంబ సభ్యులు నిజంగా ఎలాంటి వ్యక్తులు, వారి ఆలోచనలు, ప్రేరణలు, పోరాటాలు, సహజమైన బలహీనతలు ఏమిటనే అంశాలను అర్థవంతంగా చిత్రించిన సందర్భాలు చాలా తక్కువని సోనియా గాంధీ అభిప్రాయపడ్డారు. తాను దగ్గరగా చూసి, ప్రేమించిన వ్యక్తులుగా కుటుంబ సభ్యుల జీవితాలను నిజాయితీగా పాఠకుల ముందుంచాలన్నదే తన ఉద్దేశమని వివరించారు. దేశ రాజకీయ పరిస్థితులపైనా సోనియా గాంధీ తన అభిప్రాయాలను వెల్లడించారు. గత 12 ఏళ్లలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, సంస్థలు, సామాజిక నిర్మాణానికి తీవ్ర నష్టం జరిగిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిన తర్వాత కూడా వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టేందుకు సమయం పడుతుందని, రాజకీయ పార్టీలు పెద్దఎత్తున కృషి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అయినప్పటికీ కాలక్రమంలో దేశ పాలనా వ్యవస్థలు మళ్లీ సరైన దిశలోకి వస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎదుగుదల, బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజకీయ వ్యూహాల నుంచి కాంగ్రెస్ పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని సోనియా గాంధీ స్పష్టం చేశారు. మోదీ భిన్నమైన భావజాల నేపథ్యం నుంచి వచ్చారని పేర్కొంటూ, కాంగ్రెస్‌లోనూ వివిధ మార్గాల ద్వారా నాయకులు ఎదిగారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి కాంగ్రెస్ నేర్చుకోవాల్సింది పెద్దగా ఏమీ లేదని వ్యాఖ్యానించారు.

ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేవు

ప్రస్తుత రాజకీయ వాతావరణంలో కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష కూటమికి సమాన అవకాశాలు లభించడం లేదని సోనియా గాంధీ ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజకీయ పోటీలో ప్రతిపక్షాలకు సమాన స్థాయి పోటీ వాతావరణం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు, భవిష్యత్ రాజకీయ అవకాశాలపైనా తన అభిప్రాయాలను వ్యాసంలో ప్రస్తావించారు.



ముఖం పక్కనుంచే.. రాకెట్!

కేంద్ర మంత్రికి తప్పిన ప్రమాదం..జవాన్లతో దీపావళి వేడుకల్లో ఘటన

ముఖాన్ని రాసుకుంటూ వెళ్లిన స్కై షాట్..క్షేమంగా ఉన్న మంత్రి మేఘ్‌వాల్

బికనేర్, నవంబర్ 9 (సమయం న్యూస్) : దీపావళి వేడుకల్లో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. రాజస్థాన్‌లోని బికనేర్‌లో బీఎస్ఎఫ్ జవాన్లతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్న సమయంలో ఓ స్కై షాట్ రాకెట్ ఆయన ముఖానికి అతి సమీపం నుంచి దూసుకెళ్లింది. ఏమాత్రం తేడా జరిగినా ప్రాణాపాయం సంభవించే ఈ అనూహ్య ఘటనతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఆందోళన నెలకొంది. బికనేర్‌లోని బీఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయంలో జవాన్లతో కలిసి మంత్రి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చే కార్యక్రమంలో ఆయన ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చేతిలో కాకరకాయ ఒత్తి పట్టుకుని స్కై షాట్ రాకెట్‌ను వెలిగించేందుకు ఆయన సిద్ధమయ్యారు. సరిగ్గా అదే సమయంలో అక్కడున్న మరో వ్యక్తి అప్రమత్తత లేకుండా అదే రాకెట్‌కు నిప్పంటించాడు. దీంతో ఒక్కసారిగా పైకి దూసుకెళ్లిన ఆ రాకెట్ మంత్రి ముఖానికి అత్యంత సమీపంగా రాసుకుంటూ వెళ్లింది. దాని నుంచి వెలువడిన నిప్పురవ్వలు ఆయన దుస్తులపై కూడా పడ్డాయి. రెప్పపాటులో జరిగిన ఈ హఠాత్పరిణామంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే అదృష్టవశాత్తూ మంత్రి మేఘ్‌వాల్‌కు ఎలాంటి గాయాలు కాలేదని, ఆయన పూర్తిగా క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు. తృటిలో పెను ప్రమాదం తప్పడంతో బీఎస్ఎఫ్ శిబిరంలోని ఉన్నతాధికారులు, జవాన్లు అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హసీనాకు.. నో పాస్‌పోర్టు!

ఎన్ఐడీ కోసం హసీనా దరఖాస్తు.. తిరస్కరించిన బంగ్లాదేశ్ ప్రభుత్వం

భారత్ ఆమెను అప్పగించాల్సిందే..తేల్చిచెప్పిన మంత్రి కబీర్

ఢాకా, నవంబర్ 9 (సమయం న్యూస్) : భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తిరిగి తన స్వదేశానికి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు పత్రం (ఎన్ఐడీ) కోసం ఆమె అధికారికంగా దరఖాస్తు చేశారు. తీవ్ర ఆందోళనల నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్టు నెలలో హసీనా బంగ్లాదేశ్‌ను వీడి ప్రాణాలతో భారత్‌కు పారిపోయి వచ్చిన విషయం తెలిసిందే. ఆమె దేశం దాటగానే బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తక్షణమే ఆమె జాతీయ గుర్తింపు, పాస్‌పోర్టులను పూర్తిగా రద్దు చేసింది. తాజాగా పాస్‌పోర్టు కోసం ఆమె చేసుకున్న దరఖాస్తును బంగ్లాదేశ్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. హసీనాకు కొత్త పాస్‌పోర్టు గానీ, కనీసం ట్రావెల్ డాక్యుమెంట్లను గానీ జారీ చేసే ప్రసక్తే లేదని ఆ దేశ విదేశాంగ వ్యవహారాల సహాయ మంత్రి కబీర్ తేల్చిచెప్పారు. రెండు దేశాల మధ్య ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందంలోని నిబంధనలను భారత్ కచ్చితంగా పాటించాలని, హసీనాను తమకు అప్పగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. మాజీ ప్రధాని హోదాలో దర్జాగా పాస్‌పోర్టు తీసుకుని రావడం కాదని.. కేవలం న్యాయ విచారణను ఎదుర్కొనేందుకు మాత్రమే ఆమె బంగ్లాదేశ్‌కు రావాలని మంత్రి కబీర్ స్పష్టం చేశారు. తమ దేశంలో జరిగిన అల్లర్లు, హింసాత్మక ఘటనలకు సంబంధించి ఆమె విచారణను ఎదుర్కోవాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. బంగ్లా ప్రభుత్వ తాజా హెచ్చరికలతో హసీనా తిరిగి స్వదేశం వెళ్లే మార్గాలు దాదాపు మూసుకుపోయినట్లేనని అంతర్జాతీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



ఇదో కొత్త రికార్డు!

రాజ్యాంగ నిబంధనలు కాలరాసిన కేంద్రం

88 రోజులైనా సభ ప్రోరోగ్ చేయకపోవడంపై ఫైర్

డీలిమిటేషన్ కోసమే ఈ కుట్ర..కేంద్రంపై జైరాం రమేష్ విమర్శలు

న్యూఢిల్లీ, నవంబర్ 9 (సమయం న్యూస్) : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి ఏకంగా 88 రోజులైనా.. సమావేశాలు ముగిసినట్లు రాష్ట్రపతి ఇప్పటివరకు ప్రోరోగ్ (అధికారిక ముగింపు ప్రకటన) చేయకపోవడంపై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో మండిపడింది. రాజ్యాంగ నిబంధనలను కాలరాస్తూ నరేంద్ర మోదీ సర్కారు ఒక సరికొత్త రికార్డును నెలకొల్పిందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. చట్టసభలో మూడింట రెండొంతుల మెజారిటీని అక్రమ మార్గాల్లో సమకూర్చుకోవడానికే కేంద్రం ఈ సమయాన్ని వాడుకుంటోందని జైరాం రమేష్ ఆరోపించారు. తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్న వివాదాస్పద డీలిమిటేషన్ బిల్లును ఎలాగైనా ఆమోదింపజేసుకోవడానికే కేంద్ర హోంమంత్రి ఈ విరామ సమయాన్ని వినియోగించుకుంటున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.



నాడు అందరి ఆమోదంతోనే..

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలాగే వ్యవహరించిందని, '2008లో మీ ప్రభుత్వం 87 రోజుల పాటు సభను ప్రోరోగ్ చేయలేదు కదా?' అంటూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖపై రమేష్ గట్టిగా కౌంటర్ ఇచ్చారు. నాడు ఉన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా అన్ని రాజకీయ పక్షాల పూర్తి సమ్మతితోనే ఆనాడు ఆ నిర్ణయం తీసుకున్నామని జైరాం రమేష్ వివరణ ఇచ్చారు. ఇప్పటిలాగా ఎవరికీ చెప్పకుండా, ఏకపక్షంగా సభను ప్రోరోగ్ చేయకుండా ఆపలేదని ఆయన స్పష్టం చేశారు.

ఐకమత్యమే.. మహాబలం!

- చిన్మయ మిషన్ ప్రబోధకుల ఉద్బోధ
- ఆపదలో మిత్రుల సహకారం ఎంతో ముఖ్యం
- నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి
- ఒంగోలు శ్రీగిరి చిన్మయ బాల విహార్‌లో శిక్షణ
- పాల్గొన్న స్వామి సత్యాత్మానంద, ఆలూరు ఝాన్సీరాణి



ఒంగోలు, నవంబర్ 9 (సమయం న్యూస్) : సమాజంలో ఐకమత్యమే మహాబలమని చిన్మయ మిషన్ ప్రబోధకులు స్వామి సత్యాత్మానంద పేర్కొన్నారు. ఐకమత్యంతో వ్యవహరిస్తే అసాధ్యాలను కూడా సుసాధ్యం చేసుకోవచ్చని, మనల్ని మనం రక్షించుకోవడంతో పాటు దేశాన్ని కూడా రక్షించవచ్చని ఆయన ప్రబోధించారు. ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం గో క్షేత్ర భవనంలో ఏర్పాటైన 'శ్రీగిరి చిన్మయ బాల విహార్' శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఐకమత్యపు ప్రాధాన్యతను ఆయన కథల రూపంలో వివరించారు. మిత్ర లాభం కథలో వేటగాడి వలలో చిక్కుకున్న పావురాలు తమ రాజైన చిత్రగ్రీవుని సలహాను పాటించి ఐకమత్యంతో వ్యవహరించి, వలతో సహా ఆకాశంలోకి ఎగిరాయని స్వామి సత్యాత్మానంద పేర్కొన్నారు. ఆ తర్వాత చిత్ర గ్రీవుడు తన మిత్రుడైన హిరణ్యకుడనే ఎలుక సహకారంతో పావురాలకు ఎలా బంధ విముక్తి కలిగేలా చేశాడో విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు వివరించారు.

మంచి మిత్రులు ఉండాల్సిందే..

ప్రతి ఒక్కరూ మంచి మిత్రులను కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని ఆయన సూచించారు. మంచి మిత్రులను కలిగి ఉంటే ఆపద సమయంలో పరస్పర సహకారంతో ఆపద నుంచి ఎలా బయటపడవచ్చునో పంచతంత్ర కథలు మనకు చాటిచెబుతాయని తెలిపారు. అలాగే సమర్థుడైన నాయకుని లక్షణాలు ఎలా ఉంటాయో చిత్రగ్రీవుని పాత్ర ద్వారా గ్రహించవచ్చని, ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి మాట్లాడుతూ.. పంచతంత్ర కథలతో పాటు భారత, భాగవత, రామాయణాలలోని.. ఇతర గ్రంథాలలోని నీతి ప్రబోధకమైన విషయాలను విద్యార్థులకు తెలియజెప్పడం ద్వారా వారు జ్ఞానమార్గంలో నడిచేలా చేయవచ్చని పేర్కొన్నారు. శ్రీగిరి చిన్మయ బాల విహార్ శిక్షణా తరగతులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ముని గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యంతో.. మీటర్లు ఫట్!

- ఢిల్లీకి పాగ బెట్టిన టపాసులు
- ప్రమాదకర స్థాయిలో వాయుకాలుష్యం
- పనిచేయని నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు
- ఐదేళ్లలో ఇదే అత్యధిక కాలుష్యం
- ఏక్యూఐ ఏకంగా 371 నమోదు



న్యూఢిల్లీ, నవంబర్ 9 (సమయం న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలో దీపావళి టపాసుల ప్రభావం వాతావరణంపై తీవ్ర స్థాయిలో పడింది. ఆది, సోమవారాల్లో నగరంలో వాయుకాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకుంది. గత ఐదేళ్లలో మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక కాలుష్యం ఈసారే నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కాలుష్యం దెబ్బకు ఏకంగా గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు సైతం పనిచేయకుండా మొరాయించాయి. ఢిల్లీ, ఎన్‌సీఆర్‌లోని చాలా ప్రాంతాల్లో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు పలు ప్రైవేటు పర్యవేక్షణ కేంద్రాలు సైతం స్పష్టం చేశాయి.

క్రాష్ అయిన కేంద్రాలు..


ఢిల్లీలో ఉన్న మొత్తం 59 గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల డేటాను పరిశీలించగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీపావళి రాత్రి గడిచేకొద్దీ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయి డేటా అందుబాటులో లేని కేంద్రాల సంఖ్య అంతకంతకూ పెరిగింది. ఆదివారం రాత్రి ఏడు గంటలకు కేవలం ఒక్క కేంద్రంలో మాత్రమే డేటా అందుబాటులో లేకపోగా.. రాత్రి ఒంటిగంట సమయానికి ఏకంగా 36 కేంద్రాలు పనిచేయడం నిలిచిపోయాయి. ఆ సమయంలో కేవలం 23 కేంద్రాలు మాత్రమే గాలి నాణ్యత వివరాలను నమోదు చేశాయి. ఆ తర్వాత కాలుష్యం కాస్త తగ్గడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి ఆయా కేంద్రాలు క్రమంగా పనిచేయడం ప్రారంభించాయి.

371కి చేరిన ఏక్యూఐ..

సోమవారం ఢిల్లీలో ఏక్యూఐ (గాలి నాణ్యత సూచీ) 371గా ఉన్నట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. దీపావళి మరుసటి రోజు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే 2021 సంవత్సరం తర్వాత కాలుష్యం ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. దీపావళికి ముందు రోజుల్లో కాస్త మెరుగ్గా ఉన్న గాలి నాణ్యత.. టపాసుల మోతతో ఒక్కసారిగా అత్యంత విషపూరితంగా మారిపోయిందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముంబైలో.. రాకెట్లపై బ్యాన్!

- గాల్లో పేలే టపాసులపై నిషేధం
- నవంబర్ 25 వరకు అమల్లోకి..
- టెర్రస్‌లు, బాల్కనీల్లో కాల్చొద్దు
- భయపెడుతున్న అగ్నిప్రమాదాలు
- మేయర్ నీతు తావ్డే విజ్ఞప్తి




ముంబై, నవంబర్ 9 (సమయం న్యూస్) : దీపావళి వేడుకల్లో అగ్నిప్రమాదాలు భయాందోళనలు సృష్టిస్తున్న నేపథ్యంలో ముంబై విపత్తు నిర్వహణ సంస్థ సంచలన నిర్ణయం తీసుకుంది. గాల్లోకి ఎగిరి పేలిపోయే ఏరియల్ ఫైర్ క్రాకర్స్, రాకెట్లపై నవంబర్ 25వ తేదీ వరకు పూర్తిస్థాయి నిషేధం విధించింది. నగరవ్యాప్తంగా ఈ కఠిన ఆంక్షలు తక్షణమే అమల్లోకి వచ్చాయని అధికారులు స్పష్టం చేశారు.

ఎక్కడా కాల్చడానికి వీల్లేదు..

పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాలతో పాటు ఎత్తైన భవనాలు, టెర్రస్‌లు, బాల్కనీలు, పార్కింగ్ స్థలాలు, స్లమ్ ఏరియాల్లో ఎక్కడా ఈ రాకెట్లను కాల్చకూడదని అధికారులు తేల్చిచెప్పారు. ఈ నిషేధం నవంబర్ 25 రాత్రి 11.59 గంటల వరకు అమల్లో ఉంటుందని విపత్తు నిర్వహణ సంస్థ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్, అడిషనల్ మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. గాల్లోకి ఎగిరి పేలే టపాసులు బాల్కనీలు, కిటికీల్లో పడి భారీ అగ్నిప్రమాదాలకు కారణమవుతున్నాయని విశ్లేషించారు. జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలు, ఇరుకైన సందులు, వాణిజ్య సముదాయాలకు వీటివల్ల ప్రాణ, ఆస్తినష్టం ముప్పు పొంచి ఉందని హెచ్చరించారు. భవనాలకు సమీపంలో ఎలాంటి టపాసులు కాల్చవద్దని ముంబై మేయర్ నీతు తావ్డే నగర ప్రజలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు.

వందలాదిగా అగ్నిప్రమాదాలు..

ఈ నెల 8వ తేదీన నగరంలో ఏకంగా 137 అగ్నిప్రమాదాలు జరిగిన నేపథ్యంలో అధికారులు ఈ నిషేధాజ్ఞలు జారీ చేశారు. ఈ ఘటనల్లో ఇద్దరు మహిళలు గాయపడినట్లు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ అధికారికంగా వెల్లడించింది. గతంతో పోలిస్తే టపాసుల వల్ల జరిగే ప్రమాదాలు ముంబైలో తీవ్రంగా పెరిగాయి. 2024 దీపావళి సమయంలో 262 అగ్నిప్రమాదాలు జరగ్గా.. అందులో 80 ప్రమాదాలు టపాసుల వల్లే సంభవించి, ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఇక 2025లో మొత్తం 289 అగ్నిప్రమాదాలు చోటుచేసుకోగా.. ఏకంగా 113 ప్రమాదాలకు టపాసులే కారణమయ్యాయి. అదృష్టవశాత్తూ గతేడాది ఎలాంటి ప్రాణనష్టం నమోదు కాలేదు. కానీ పెరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా తాజా నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు.



కవితలో కాలం పలికిన స్వరం

అందెశ్రీ

నేడు అందెశ్రీ ప్రథమ వర్ధంతి

తెలుగు నేలపై తన గొంతుతో, తన గీతాలతో ప్రజల గుండెల్లో నినదించిన పేరు అందెశ్రీ. అసలు పేరు అందె ఎల్లయ్య. విద్యా ప్రక్రియలో అడుగుపెట్టక పోయినా, ప్రజల మనస్సుల్లో పఠితుడైన కవి ఆయన. నిరక్షరాస్యుడైనప్పటికీ తన హృదయాన్ని కవిత్వంగా మార్చుకొని, తెలంగాణ భూమి, దాని భాష, దాని మనుషులు, దాని పోరాటాలకు స్వరం ఇచ్చిన అపూర్వ గేయకవి అందెశ్రీ. 1961 జూలై 18న అప్పటి వరంగల్ జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో ఆయన జన్మించారు. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా పెరిగారు. చదువు లేకపోవడం ఆయన కవిత్వానికి అడ్డంకి కాలేదు. గొర్రెల కాపరిగా, తాపీ పనికూలీగా జీవనం సాగించిన ఈ కవి, తన అంతరంగంలోని వేదనను, ప్రకృతి పట్ల ప్రేమను, మానవతా విలువలను గీతాలుగా మలచాడు. నిజామాబాద్ ప్రాంతంలో తాపీ పని చేస్తున్నప్పుడు ఆయన పాటలు విన్న శృంగేరి మఠానికి చెందిన శంకర్ మహారాజ్ ఆయనను చేరదీసి, ఆయన ప్రతిభను వెలికితీశారు. ఆ పరిచయమే కవి జీవితాన్ని మలుపుతిప్పింది. అక్షరాలను నేర్చుకోకపోయినా, అక్షరాలకు అర్థం చెప్పిన కవి ఆయన. తన ఆశు కవిత్వం, స్వతంత్ర వాక్యనిర్మాణం, అంతర్భావం ఆయనను ప్రజాకవిగా నిలబెట్టాయి. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న రోజుల్లో, అందెశ్రీ గీతాలు ప్రజల్లో ఉత్సాహం నింపాయి. ఆయన గీతం "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందడం చారిత్రక ఘట్టం. ప్రతి విద్యాసంస్థలో, ప్రభుత్వ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయాన్నే ఆ గీతం ప్రతిధ్వనించడం ఆయన కవిత్వం ప్రజల్లో పొందిన స్థిరమైన స్థానం యొక్క సాక్ష్యం. అందెశ్రీ రచనల్లో మట్టి వాసన, మనిషి శ్వాస, భాష సౌందర్యం మిళితమై ఉంటాయి. ఆయన గీతాలు కేవలం వినోదం కోసం కాదు, అవి ప్రజల ఆత్మగీతాలు–చైతన్యరాగాలు. "మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు" అనే గీతం (ఎర్ర సముద్రం సినిమా) సమాజంలో నశిస్తున్న మానవత్వంపై ఆయన ఆవేదనను ప్రతిబింబిస్తుంది. ఈ గీతాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు తెలుగు సిలబస్‌లో చేర్చడం ఆయన కవిత్వానికి లభించిన అంగీకారానికి చిహ్నం. "పల్లె నీకు వందనములమ్మో", "గలగల గజ్జెల బండి", "కొమ్మ చెక్కితే బొమ్మరా" వంటి పాటలు ఆయన సృజనలోని గ్రామీణ రసాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రతిఫలిస్తాయి. "జనజాతరలో మన గీతం", "యెల్లిపోతున్నావా తల్లి" వంటి పద్యాలు ఆయన లోని మానవతా కవి స్వభావానికి ఉదాహరణలు. 2006లో వచ్చిన 'గంగ' సినిమాకు ఆయన రాసిన పాటకు నంది పురస్కారం లభించింది. అదే సంవత్సరం నుంచి ఆయన పేరు రాష్ట్ర సరిహద్దులను దాటి ప్రతిధ్వనించింది. ఆయన ప్రతిభను గుర్తించిన కాకతీయ విశ్వవిద్యాలయం 2008లో గౌరవ డాక్టరేట్ అందజేసింది. ఆ తర్వాత అమెరికాలోని అకాడమీ ఆఫ్ యూనివర్సల్ గ్లోబల్ పీస్, వాషింగ్టన్ డి.సి. వారిచే ఆయనకు గౌరవ డాక్టరేట్, లోకకవి బిరుదు లభించాయి. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర విశిష్టమైనది. తెలంగాణ ధూంధాం కార్యక్రమ రూపశిల్పిగా ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం రగిలించిన కవి ఆయన. ఆయనే ప్రజా గీతాల రూపంలో ఉద్యమానికి ఊపిరి పోశాడు. 2014లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరును పద్మశ్రీ పురస్కారం కోసం ప్రతిపాదించింది. 2025 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆయనకు రూ. కోటి నగదు పురస్కారం అందజేయడం ఆయన సాహిత్య కృషికి లభించిన గౌరవం. అందెశ్రీ సాహిత్యం మట్టిలోనుంచి మొలిచినది. అది భాషలో, బతుకులో, బంధాలలో, బతుకుబాటలో దాగి ఉన్న మానవ వేదనను ప్రతిబింబిస్తుంది. కవిత్వం అనేది పుస్తకాలలో ఉండే అక్షరం కాదని, పల్లెలో వినిపించే గళమని ఆయన నిరూపించారు. తన గీతాలతో తెలంగాణ సాంస్కృతిక ఆత్మకు రూపం ఇచ్చిన ఆయనకు, కవి కాకుండా ప్రజా భావజాలానికి ప్రతినిధి అనే విశేషణం సముచితమవుతుంది. సాహిత్య సృష్టులు ఆయన జీవితం – ఆయన గీతాల్లో జలజీవన వేదన ఉంది, పల్లెల మనసు ఉంది, తెలంగాణ ఆత్మ ఉంది. నవంబర్ 10, 2025న ఆయన పరమపదించినా, ఆయన స్వరం తెలంగాణ మట్టి, గాలి, జలంలో ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. అందెశ్రీ కవిత్వం – తెలంగాణ గళం, ప్రజల హృదయం.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

విజ్ఞానమే విశ్వ ప్రగతికి పునాది!

నేడు ప్రపంచ సైన్స్ దినోత్సవం



ప్రపంచ సైన్స్ దినోత్సవం ప్రధానంగా నాలుగు ప్రధాన కారణాల కోసం జరుపుకుంటారు. సైన్స్ మన ఆరోగ్యం, ఆహారం, శక్తి, పర్యావరణం వంటి అనేక రంగాలలో కీలక పాత్ర పోషిస్తుంది. సైన్స్ వినియోగం ఎలా జరుగుతుందో, అది ప్రజలకు ఎలా ఉపయోగ పడుతుందో ఈ రోజుతో అవగాహన కలుగుతుంది. వివిధ రంగాల్లో పరిశోధనలు, కనుగొనడాలు చేసిన శాస్త్రవేత్తలు విజ్ఞాన శాస్త్రానికి అసాధారణ చేసిన కృషిని గౌరవించడానికి ఈ రోజు ఒక మంచి అవకాశం. సైన్స్ ఆవిష్కారాలు, పురోగతులు సాంఘిక జీవనానికి ప్రయోజనం చేకూరుస్తాయి. సైన్స్ లోని కొత్త ఆవిష్కారాలను సొంతంగా మన జీవనంలో అనుసంధానించడం, వాటిని సమాజానికి సమర్థించు కోవడం ఈ రోజు ప్రాధాన్యత. యువతలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడం, పరిశోధనలకు ప్రోత్సాహం ఇవ్వడం, తద్వారా కొత్త శాస్త్రవేత్తలను తయారు చేయడం కోసం ఈ రోజు ఒక ప్రేరణ. ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజును పలు రకాల కార్యక్రమాలతో జరుపు కుంటారు. పాఠశాలలు, కళాశాలలు, పరిశోధనా సంస్థలు విద్యార్థులకు తమ సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించే అవకాశం ఇస్తాయి. ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొనే సదస్సులు నిర్వహించ బడతాయి. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు అనేక రకాల సైన్స్ పోటీలు నిర్వహించ బడతాయి. సైన్స్ రంగానికి సంబంధించిన డాక్యుమెంటరీలు, చిత్రాలు ప్రదర్శించ బడతాయి. సందర్శకుల కోసం సైన్స్ మ్యూజియంలు ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తాయి. ప్రపంచ సైన్స్ దినోత్సవం విజ్ఞాన శాస్త్రం ప్రాముఖ్యతను గుర్తించే ఒక ప్రత్యేకమైన రోజు. సైన్స్ మన జీవితాలను మెరుగుపరిచే ఒక సాధనం మాత్రమే కాదు, అది సమాజానికి, ప్రపంచానికి పురోగతిని అందించే ఒక గొప్ప శక్తి. అందుకే, మనం ఈ రోజును జరుపుకోవడం ద్వారా సైన్స్ పట్ల గౌరవాన్ని, యువతకు సైన్స్ పై ఆసక్తిని పెంచడానికి కృషి చేయాలి.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



ప్రపంచ సైన్స్ దినోత్సవం ప్రతి సంవత్సరం నవంబర్ 10న జరుపు కుంటారు. ఈ రోజు సైన్స్ ప్రాముఖ్యతను గుర్తించడం ద్వారా మానవాళి అభివృద్ధికి దోహదం చేసే విజ్ఞాన శాస్త్రంపై అవగాహన పెంచుతుంది. సైన్స్ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించడానికి, జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి కీలక పాత్ర పోషిస్తుంది.

తెలుగు భాషకు చార్లెస్ బ్రౌన్ ఎనలేని సేవ

నేడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ జయంతి


పరదేశీయుడైనా, ఆంగ్ల భాష మాతృభాష అయినా, బహు భాషవేత్త అయి ఉండీ, ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా భారత దేశానికి వచ్చి, విధి నిర్వహణ కోసం తెలుగు భాష నేర్చుకుని, నాటికి కరడుగట్టి, మినుకు మినుకు మంటూ, ఆరి పోవడానికి సిద్ధంగా ఉన్న తెలుగు భాష ఉద్ధరణకు బ్రౌన్ తీసుకున్న చొరవ ప్రశంసనీయం. ఆంగ్లేయులు పురాణాలను ప్రచురించడం, వ్యాఖ్యానాలు రాయించడం, తెలుగు నేర్చు కోవడం కోసం వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాయడం, ప్రచురించడం, సహస్రాధిక వేమన పద్యాలను వెలికితీసి ప్రచురిం చడం, పాఠశాలలు స్థాపించి, ఉచిత విద్య నేర్చుకునే అవకాశం కల్పించడం, ప్రాచీన గ్రంథాలను అర్థం చేసుకోవడానికి ఏకంగా నిఘంటువుని అందించడం ద్వారా తెలుగు భాషా, సాహిత్య వికాసానికి బ్రౌన్ అందించిన సేవ అమోఘం, అపూర్వం, అస మానం అనితర సాధ్యం.

చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (నవంబర్ 10, 1798 – డిసెంబర్ 12, 1884) తెలుగు సాహిత్యమునకు విశేష సేవ చేసిన ఆంగ్లేయుడు. తొలి తెలుగు శబ్దకోశమును ఆయనే పరిష్కరించి ప్రచురించాడు. బ్రౌన్ దిక్షనరీని ఇప్పటికి తెలుగులో ప్రామాణికంగా ఉపయోగిస్తారు.

సి. పి. బ్రౌన్ 1798 నవంబర్ 10న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి దేవిడ్ బ్రౌన్ పేరొందిన క్రైస్తవ విద్వాంసుడు. తండ్రి మరణించిన తరువాత బ్రౌ ను కుటుంబం ఇంగ్లండు వెళ్ళిపోయింది. తండ్రి ఇచ్చిన స్ఫూర్తితో సీపీ బ్రౌన్ గ్రీక్, లాటిన్, పారశీ, సంస్కృత భాషల్లో ఆరితేరాడు, బ్రౌను అక్కడే హిందూ స్థానీ భాష నేర్చుకున్నాడు. తరువాత 1817 ఆగష్టు 4 న మద్రాసులో ఈస్ట్ ఇండియా కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా మద్రాసులో కోదండరామ పంతులు వద్ద తెలుగులో ప్రాథమిక జ్ఞానాన్ని సంపాదించాడు.

1820 ఆగస్టులో కడపలో డిప్యూటీ కలెక్టరుగా చేరాడు. ఉద్యోగరీత్యా అనేక ప్రాంతాల్లో పని చేసినపుడు తెలుగులో మాట్లాడడం తప్పనిసరి అయింది. అయితే తెలుగు నేర్చు కోడానికి సులభమైన, శాస్త్రీయ మైన విధానం లేక పోవ డం వలన, పండితులు తమ తమ స్వంత పద్ధతులలో బోధిస్తూ ఉండేవారు. తెలుగేతరులకు ఈ విధంగా తెలుగు నేర్చుకోవడం ఇబ్బందిగా ఉండేది. భాష నేర్చుకోవడంలో ని ఇబ్బంది, బ్రౌనును తెలుగు భాషా పరిశోధనకై పురికొ ల్పింది. ప్రాచీన తెలుగు కావ్యాలను వెలికితీసి, ప్రజలందరికీ అర్థమయ్యేలా పరిష్కరించి, ప్రచురించడం, భాషకు ఓ వ్యాకరణం, ఓ నిఘంటువు, ఏర్పడడానికి దారి తీసింది. మచిలీపట్నం, గుంటూరు, చిత్తూరు, తిరునెల్వేలి మొదలైన చోట్ల పనిచేసి, 1826లో మళ్ళీ కడపకు తిరిగి వచ్చి అక్కడే స్థిర నివాస మేర్పరచు కొన్నాడు.

కడపలోను, మచిలీపట్నంలోను కూడా పాఠశాలలు పెట్టి ఉచితంగా చదువు చెప్పించాడు. విద్యార్థులకు ఉ చితంగా భోజన వసతి కూడా కల్పించాడు. 1834లో ఉ ద్యోగం నుండి తొలగించడంతో ఇంగ్లండు వెళ్ళిపోయి, తిరిగి 1837లో కంపెనీలో పర్షియను అనువాద కుడిగా భారత దేశానికి వచ్చాడు.



1827 నాటికే, బ్రౌన్ 'ఆంధ్ర గీర్వాణ ఛందము' అనే పుస్తకం రాసినప్పటికీ, ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిన పుస్తకం 1829 నాటి 'వేమన శతకం'. అప్పటికి బ్రౌన్ అయిదేళ్లుగా వేమన సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ ఉ న్నారు. ఇందులో దాదాపు 700 పద్యాలకు ఆంగ్లాను వాదాలతో పాటు విస్తృతమయిన పదకోశం కూడా సమకూర్చారు. మరో పదేళ్ల తర్వాత, 1164 పద్యాల వరకు విస్తరింపచేసి, తిరిగి 'వేమన శతకం' అచ్చువేశాడు. పదవీ విరమణ తరువాత 1854లో లండన్‌లో స్థిరపడి, 1865లో లండన్ యూనివర్సిటీలో తెలుగు ప్రొఫెసరుగా నియమితుడైనాడు.

బ్రౌన్ కొలువులో తొలి తెలుగు కథకుడు తాతాచారి అనే పేరుతో ప్రాచుర్యం పొందిన నేలటూరు వేంకటాచలం. తాతాచారి చెప్పిన కథలను విన్న సి. పి. బ్రౌన్ అందులోంచి 24 కథలను, దానితోపాటు శ్రీకృష్ణమాచారి చెప్పిన రెండు కథలను కలిపి 1855లో పుస్తకంగా ముద్రించారు. 1916లో 'తాతాచారి కథలు ' గిడుగు వేంకట అప్పారావు సంపాదకత్వంలో ద్వితీయ ముద్రణ పొందాయి. 1951లో వావిళ్ల వారి తృతీయ ముద్రణ, 1974లో బంగోరె సంపాదకుడిగా చతుర్థ ముద్రణ పొందాయి. 1848లో చెన్నపట్నం వెళ్లి బ్రౌను కొలువులో ఏడేళ్లు పల్నాటి వీర చరితం, వసు చరిత్ర మొదలైన గ్రంథా ల పరిష్కార కృషిలో ఆయనకు సాయపడ్డారు. తాతాచార్యులు కావ్య తర్క వ్యాకరణముల యందు ప్రవీణత గలవాడు. తాతాచారి కథలు నీతి బోధకాలే కాక, ఆనాటి సామాజిక స్థితికి దర్పణంగాను ఉన్నాయి. అందులోని శైలి శుద్ధ వ్యావహారికం అయిన కారణంగా పండిత శైలికి దూరంగా ఉందనే బ్రౌన్ ప్రశంసకు యోగ్యమైంది.

బ్రౌన్ వేమన పద్యాలను వెలికితీసి ప్రచురించాడు. 1829లో 693 పద్యాలు, 1839లో 1164 పద్యాలు ప్రచురించాడు. 1841లో "నలచరిత్ర"ను ప్రచురించాడు. "ఆంధ్ర మహా భారతము", "శ్రీమద్భాగవతము" లను ప్రచురించాడు. తెలుగు నేర్చుకునే ఆంగ్లేయుల కొరకు వాచకాలు, వ్యాకరణ గ్రంథాలు రాసాడు. 1840లో వ్యాకరణాన్ని ప్రచురించాడు. లండన్‌లోని "ఇండియాహౌ స్ లైబ్రరీ"లో పడి ఉన్న 2106 దక్షిణభారత భాషల గ్రంథాలను మద్రాసు తెప్పించాడు. "హరిశ్చంద్రుని కష్టాలు" గౌరన మంత్రిచే వ్యాఖ్యానం వ్రాయించి 1842లో ప్రచురించాడు. 1844లో "వసుచరిత్ర"', 1851లో "మను చరిత్ర" ప్రచురించాడు. జూలూరి అప్పయ్య శాస్త్రి చేత వీటికి వ్యాఖ్యానాలు రాయించాడు. 1852లో "పలనాటి వీరచరిత్ర" ప్రచురించాడు.

పందొమ్మిదో శతాబ్ది తొలి చివర్లో తాను తెలుగు సాహిత్యంలో కృషి మొదలుపెట్టే నాటికి నెలకొని వుండిన స్థితిగతులను గురించి బ్రౌన్ స్ఫుటమయిన మాటల్లో అభివర్ణించాడు. 'అప్పటికి తెలుగు సాహిత్యం కొనప్రాణంతో కొట్టుకు మిట్టాడుతోంది. 1825 నాటికి ప్రమిదలో దీపం కొడిగట్టి పోతోంది. తెలుగు సాహిత్యం దాదాపు అంతరించి పోతూ ఉండడం నా కళ్లబడింది. నేను 30 ఏళ్లు కృషి చేసి, దాన్ని పునఃప్రతిష్ఠ చేశాన'న్నాడు బ్రౌన్. తెలుగు భాషాభివృద్ధికి ఇతోధిక సేవలు అందించి, మరచిపోలేని కృషి సల్పిన బ్రౌన్ 1884 డిసెంబర్ 12 న తన స్వగృహము 22 కిల్డారే గార్డెన్స్, వెస్ట్‌బార్న్ గ్రోవ్, లండన్లో అవివాహితుని గానే బ్రౌన్ మరణించాడు. ఆయనను కెన్సెల్ గ్రీన్ శ్మశానంలో సమాధి చేశారు.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

న్యూజిలాండ్‌కు డబుల్ షాక్!

భారత్‌తో వన్డే సిరీస్‌లో కివీస్‌కు వరుస ఎదురుదెబ్బలు



- గాయంతో చివరి రెండు వన్డేలకు లాకీ ఫెర్గూసన్ దూరం
- తలకు బంతి తగలడంతో బ్లెయిర్ టిక్నర్‌కు తప్పనిసరి విశ్రాంతి
- టిక్నర్ స్థానంలో క్రిస్టియన్ క్లార్క్‌కు అవకాశం
- ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓటమి.. కీలక ఆటగాళ్ల గాయాలతో సతమతం
- నేడు హామిల్టన్‌లో మూడో వన్డే

హామిల్టన్, నవంబర్ 9 (సమయం న్యూస్): భారత్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్‌కు ఎదురుదెబ్బల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే తొలి రెండు వన్డేల్లో ఓటమి పాలైన కివీస్‌కు మరో ఇద్దరు కీలక ఆటగాళ్లు దూరమయ్యారు. స్టార్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ గాయం కారణంగా చివరి రెండు వన్డేలకు అందుబాటులో ఉండటం లేదని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది. మరోవైపు తలకు బంతి తగిలిన బ్లెయిర్ టిక్నర్ తప్పనిసరి విశ్రాంతి కారణంగా మూడో, నాలుగో వన్డేలకు దూరమయ్యాడు. దీంతో టిక్నర్ స్థానంలో క్రిస్టియన్ క్లార్క్‌ను జట్టులోకి తీసుకున్నారు. వరుస ఓటములతో ఒత్తిడిలో ఉన్న న్యూజిలాండ్‌కు కీలక ఆటగాళ్ల గాయాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. వెల్లింగ్టన్‌లో జరిగిన రెండో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బ్లెయిర్ టిక్నర్ హెల్మెట్‌కు బంతి బలంగా తగిలింది. అనంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లో అతడికి మెదడు కుదుపు లక్షణాలు లేవని నిర్ధారించినప్పటికీ, తలకు బంతి తగిలిన ఘటన నేపథ్యంలో ఏడు రోజుల విశ్రాంతి అవసరమైంది. దీంతో మూడో, నాలుగో వన్డేలకు అతడు అందుబాటులో ఉండటం లేదు. వర్షం కారణంగా అంతరాయం కలిగిన రెండో వన్డేలో టిక్నర్ స్థానంలో మాట్ ఫిషర్ బరిలోకి దిగాడు. తొలి వన్డేలో పదకొండో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన టిక్నర్ నాలుగు భారీ సిక్సర్లు బాది ఆకట్టుకున్నాడు. టిక్నర్ స్థానంలో నార్తర్న్ డిస్ట్రిక్ట్స్ ఫాస్ట్ బౌలర్ క్రిస్టియన్ క్లార్క్‌కు న్యూజిలాండ్ జట్టులో చోటు కల్పించారు. ఇటీవల ఫోర్డ్ ట్రోఫీలో ఆడిన క్లార్క్, భారత్-ఏ జట్టుతో జరిగిన మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్-ఏ తరఫున ప్రాతినిధ్యం వహించాడు. నాలుగు రోజుల మ్యాచ్‌ల సిరీస్‌లో నాలుగు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు వికెట్లు పడగొట్టడంతోపాటు బ్యాటింగ్‌లో 42, 41 పరుగులు సాధించాడు. న్యూజిలాండ్ తరఫున ఇప్పటికే నాలుగు వన్డేలు, ఒక అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడిన అనుభవం అతడికి ఉంది. న్యూజిలాండ్ స్టార్ పేసర్ లాకీ ఫెర్గూసన్ కుడి కాలి కండరానికి అయిన గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. భారత్‌తో జరిగిన టీ20 సిరీస్ సమయంలో అతడి కండరాల్లో స్వల్ప చీలిక ఏర్పడింది. దీంతో నాలుగో, ఐదో వన్డేలకు అతడిని అందుబాటులో ఉంచలేమని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు తెలిపింది. వేగవంతమైన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టగల ఫెర్గూసన్ సేవలు అందకపోవడం కివీస్ బౌలింగ్ విభాగానికి ఎదురుదెబ్బగా మారింది. మరో కీలక పేసర్ మాట్ హెన్రీ ఆరోగ్య పరిస్థితిని న్యూజిలాండ్ వైద్య బృందం ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. ఆక్లాండ్‌లో తొలి వన్డేకు ముందు సాధన సమయంలో డెవాన్ కాన్వేతో ఢీకొన్న హెన్రీకి అప్పట్లో మెదడు కుదుపు లక్షణాలు లేవని వైద్యులు నిర్ధారించారు. అయితే రెండో టీ20 సందర్భంగా అతడి కుడి తొడ కండరానికి స్వల్ప గాయమైంది. నాలుగో వన్డే నాటికి హెన్రీ తిరిగి అందుబాటులోకి వస్తాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. హెన్రీతోపాటు కైల్ జేమీసన్ కూడా వన్డే జట్టుతోనే కొనసాగనున్నారు. వాస్తవానికి మూడో వన్డే అనంతరం వీరిద్దరూ టెస్టు సిరీస్ సన్నాహాల కోసం జట్టును వీడాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో వన్డే జట్టుతో కొనసాగాలని నిర్ణయించారు.

గాయాలతో సతమతమవుతున్న కివీస్

ఈ సిరీస్‌లో న్యూజిలాండ్‌ను గాయాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. ఇప్పటికే డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్ర, మార్క్ చాప్‌మన్ గాయాల కారణంగా జట్టుకు దూరమయ్యారు. తాజాగా టిక్నర్, ఫెర్గూసన్ కూడా అందుబాటులో లేకపోవడంతో జట్టు కూర్పులో మార్పులు తప్పడం లేదు. తొలి రెండు వన్డేల్లో పరాజయం పాలైన న్యూజిలాండ్ నవంబర్ 10న హామిల్టన్‌లో జరిగే మూడో వన్డేలో విజయం సాధించి సిరీస్‌లో నిలవాలని పట్టుదలతో ఉంది. మూడో వన్డేకు న్యూజిలాండ్ జట్టు: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మైకేల్ బ్రేస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ, మాట్ ఫిషర్, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, టామ్ లాథమ్ (వికెట్ కీపర్), డారిల్ మిచెల్, హెన్రీ నికోల్స్, గ్లెన్ ఫిలిప్స్, టిమ్ సీఫర్ట్, నాథన్ స్మిత్, విల్ యంగ్. నాలుగో వన్డేకు న్యూజిలాండ్ జట్టు: మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైకేల్ బ్రేస్‌వెల్, క్రిస్టియన్ క్లార్క్, జాకబ్ డఫీ, మాట్ ఫిషర్, డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్, మిచెల్ హే (వికెట్ కీపర్), మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, నిక్ కెల్లీ, టిమ్ సీఫర్ట్ (వికెట్ కీపర్), విల్ యంగ్.



హైదరాబాదీ బాడీబిల్డర్ వెంకటేశన్‌కు

మిస్టర్ నేచురల్ వరల్డ్ టైటిల్!

హైదరాబాద్, నవంబర్ 9 (సమయం న్యూస్): లాస్ ఏంజిలెస్‌లో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగిన 'మిస్టర్ నేచురల్ వరల్డ్ బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్' పోటీల్లో హైదరాబాదీ బాడీబిల్డర్ కే.వెంకటేశన్ అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. నూరు శాతం వృక్ష ఆధారిత ఆహారాన్ని మాత్రమే తీసుకునే శాఖాహారి అయిన వెంకటేశన్, అంతర్జాతీయ స్థాయిలో తిరిగి స్వర్ణ పతకం గెలవడం పట్ల తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. గత ఏడాది కూడా ఇదే అంతర్జాతీయ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించినట్లు 49 ఏళ్ల వెంకటేశన్ గుర్తు చేశారు. ప్రతి బాడీబిల్డింగ్ పోటీ ఒక కొత్త సవాల్‌తో కూడుకున్నదని, ఈ ఛాంపియన్‌షిప్‌లో ప్రతీ పోటీదారు తీవ్రమైన పోటీని అందించారని తెలిపారు. శాఖాహారిగా ఉంటూ బాడీబిల్డింగ్ రంగాన్ని కొనసాగించడం అత్యంత కష్టమైన అంశమని, అయినప్పటికీ వృక్ష ఆధారిత జీవనశైలితో కూడా అనుకున్న ఫిట్‌నెస్ లక్ష్యాలను సులువుగా సాధించవచ్చని వెంకటేశన్ నిరూపించారు. బాడీబిల్డింగ్ కేవలం తన హాబీ మాత్రమే కాదని, అది తన ప్యాషన్, లైఫ్‌స్టయిల్ అని స్పష్టం చేశారు. డబ్బు కోసమో లేదా పేరు ప్రఖ్యాతుల కోసమో ఈ పోటీల్లో పాల్గొనలేదని, బాడీబిల్డింగ్‌ను హృదయపూర్వకంగా ఇష్టపడతానని పేర్కొన్నారు. ప్రతీ ఏడాదీ తనకి తానే సరికొత్త సవాళ్లు విసురుకుంటూ ముందుకు సాగుతానని చెప్పారు. కఠిన శ్రమ, అనంతమైన సహనం, నిరంతర క్రమశిక్షణ, తనపై తనకు ఉన్న నమ్మకం వల్లే ఈ పతకాన్ని సాధించగలిగినట్లు వెంకటేశన్ వివరించారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమను ప్రదర్శించడం వల్లే ఈ స్థాయిలో ఫిట్‌నెస్ సాధించగలిగానన్నారు. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో నిరంతరం సహకరిస్తున్న జూబ్లీహిల్స్‌లోని 'వన్ ఫిట్‌నెస్ స్టూడియో' కో-ఓనర్ కుమార్ మన్నావాకు ఈ సందర్భంగా వెంకటేశన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



కోహ్లీతో మాట్లాడాలంటే కోచ్‌లే భయపడతారు: ర్యాన్‌టెన్ డస్కటే!

హైదరాబాద్, నవంబర్ 9 (సమయం న్యూస్): భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీపై టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ ర్యాన్‌టెన్ డస్కటే ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఒకానొక దశలో విరాట్ కోహ్లీ వరుసగా ఫామ్‌లేమితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. మ్యాచ్‌ల్లో ఒకే తరహాలో ఆఫ్ స్టంప్ బయట వెళ్తున్న బంతులను డ్రైవ్ చేయబోయి క్యాచ్ ఔటై పెవిలియన్ చేరేవాడు. ఈ సమయంలో కోచింగ్ సిబ్బంది ఎందుకు జోక్యం చేసుకోవడం లేదనే విమర్శలు కూడా వచ్చాయి. ఇదే విషయంపై స్పందించిన డస్కటే, మైదానంలో స్టార్‌డమ్ కలిగిన ఆటగాళ్లకు సలహాలు ఇవ్వాలంటే కోచ్‌లే ఇబ్బందిపడతారని అభిప్రాయపడ్డాడు. ఎవరైనా ఒక అగ్రశ్రేణి స్టార్ ప్లేయర్ పరుగులు చేసేందుకు ఇబ్బంది పడుతుంటే జోక్యం చేసుకునేందుకు చాలా మంది కోచ్‌లు భయపడతారని డస్కటే తెలిపాడు. అనవసరంగా తమ విషయంలో జోక్యం చేసుకుంటున్నారని లేదా ఇబ్బంది పెడుతున్నారని ఆటగాడు భావిస్తాడేమోనని ఆందోళన చెందుతారని పేర్కొన్నాడు. అయితే ఒక ఆటగాడికి ఉపయోగపడే ఉపయోగకరమైన సూచన ఇవ్వాలా? లేక అతడిని మరింత గందరగోళానికి గురిచేయాలా? అనే విషయంలో స్పష్టమైన సమతుల్యత అవసరమని స్పష్టం చేశాడు. గతంలో ఆస్ట్రేలియా పర్యటనలో కోహ్లీ వరుసగా ఒకే తరహాలో ఔటవుతుండటాన్ని గమనించానని డస్కటే వెల్లడించాడు. నాలుగో టెస్టు సమయంలో అతడితో ఈ విషయం మాట్లాడాలని అనుకున్నానని, అయితే ఎలా చెప్పాలి? ఎప్పుడు చెప్పాలి? అన్నదానిపై చాలా ఆలోచించినట్లు చెప్పాడు. చివరకు వర్షం కారణంగా ఆటకు విరామం వచ్చిన సమయంలో ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా చాలా సానుకూలంగా అతడితో మాట్లాడానని తెలిపాడు. డస్కటే సలహాపై విరాట్ కోహ్లీ చాలా అద్భుతంగా స్పందించాడని కొనియాడాడు. తన షాట్ ఎంపిక వెనుక ఉన్న కారణాలను విరాట్ వివరించాడని, తాను ఎందుకు ఆ విధంగా డ్రైవ్ చేయాలనుకుంటున్నాడో స్పష్టం చేశాడన్నాడు. కోహ్లీ అభిప్రాయాన్ని అర్థం చేసుకున్న తర్వాత దానికి అనుగుణంగా కొన్ని చిన్న మార్పుల గురించి ఇద్దరం చర్చించగలిగామని వివరించాడు. ఆ క్లిష్ట సమయంలో తన సమస్యపై మాట్లాడటానికి ఎవరో ఒకరు ముందుకు రావాలని కోహ్లీ కూడా నిజంగా కోరుకున్నాడని డస్కటే పేర్కొన్నాడు.



క్రికెట్ పుట్టినింటికే ఆర్థిక కష్టాలు!

రూ.627 కోట్ల భారీ నష్టం దిశగా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు

2027లో టీమిండియా పర్యటన లేకపోవడంతో ఆదాయానికి గండి

లండన్, నవంబర్ 9 (సమయం న్యూస్): క్రికెట్‌కు పుట్టినిల్లయిన ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) త్వరలో భారీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు సుమారు 50 మిలియన్ పౌండ్లు (భారత కరెన్సీలో దాదాపు రూ. 627 కోట్లు) భారీ నష్టాన్ని మూటగట్టుకోబోతున్నట్లు తెలుస్తోంది. టీమిండియా పర్యటన లేకపోవడం, మరోవైపు ఐసీసీ నుంచి రావాల్సిన రెవెన్యూలో కోత పడనుండటంతో ఈసీబీకి ఈ దుస్థితి తలెత్తింది. ప్రముఖ మీడియా సంస్థ 'ది గార్డియన్' కథనం ప్రకారం.. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు ఆర్థిక పరిస్థితి ఇంతలా దిగజారడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది, ఇంగ్లాండ్‌లో జరిగే మ్యాచ్‌లు, బ్రాడ్‌కాస్టింగ్ ఆదాయం పూర్తిగా అక్కడ పర్యటించే జట్లపై ఆధారపడి ఉంటాయి. అయితే 2027లో భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించట్లేదు. దీంతో అటు టీవీ వీక్షకాదరణ, ఇటు కమర్షియల్ ఆదాయంపరంగా బోర్డుకు కోలుకోలేని దెబ్బ తగలనుంది. ఇక రెండో కారణం అంతర్జాతీయ క్రికెట్ మండలి తీసుకున్న నిర్ణయం. 2027లో మెంబర్ కంట్రీస్‌కు పంచాల్సిన బ్రాడ్‌కాస్ట్ రెవెన్యూలో కొంత మొత్తాన్ని హోల్డ్‌లో పెట్టాలని ఐసీసీ భావిస్తోంది. 2028 నుంచి ప్రారంభమయ్యే కొత్త రైట్స్ సైకిల్‌లో బ్రాడ్‌కాస్టింగ్ డీల్ విలువ తగ్గే అవకాశం ఉందని ఐసీసీ అంచనా వేస్తోంది. ఆ సమయంలో క్రికెట్ బోర్డులపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, ముందు జాగ్రత్తగా 2027 పంపకాల నుంచే కొంత సొమ్మును దాచిపెడుతోంది. ఈ నిర్ణయం వల్ల ఒక్క ఇంగ్లాండే కాకుండా 12 ఫుల్ మెంబర్ నేషన్స్‌పై ప్రభావం పడనుంది. ఈ నష్టాన్ని తగ్గించుకునేందుకు ఈసీబీ ప్రయత్నాలు చేస్తూ, ఐసీసీతో చర్చలు జరిపి నష్టాన్ని 35 మిలియన్ పౌండ్లకు (సుమారు రూ. 439 కోట్లు) పరిమితం చేయాలని కోరుతోంది.

భారత మార్కెట్‌పై విపరీతమైన ఆధారపడటమే కారణం

ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు ఇంతలా ఆందోళన చెందడానికి భారత మార్కెట్టే ఉన్న అపరిమితమైన ఆధారపడటమే ప్రధాన కారణం. అక్కడ టీవీ రైట్స్, వ్యూయర్‌షిప్ రెవెన్యూ విలువ భారీగా పెరగాలంటే టీమిండియా మ్యాచ్‌లు అత్యంత కీలకం. ప్రస్తుతం సోనీ పిక్చర్స్‌తో ఈసీబీకి 185 మిలియన్ పౌండ్ల (సుమారు రూ. 2,323 కోట్లు) ఆరేళ్ల కాంట్రాక్ట్ ఉంది. ఇది 2028తో ముగియనుండగా, ఆ తర్వాత వచ్చే కొత్త డీల్ విలువ బాగా తగ్గే అవకాశం ఉంది. ఈ ఆర్థిక ప్రభావం కేవలం ఈసీబీ బోర్డుతోనే ఆగిపోకుండా, అక్కడి కౌంటీ సిస్టమ్‌పై కూడా తీవ్రంగా పడేలా ఉంది. ఈసీబీకి ఆదాయం తగ్గితే, అది కౌంటీలకు ఇచ్చే ఆర్థిక సహకారం (ఫీబఅఅఅస్త్ర) భారీగా తగ్గిపోతుంది. ఇప్పటికే అక్కడ ఉన్న 18 కౌంటీ జట్లలో 10 జట్లు నష్టాల్లో నడుస్తున్నాయి. 2025లో ఈసీబీ 12.6 మిలియన్ పౌండ్ల లాభం సాధించినప్పటికీ, 2027లో పరిస్థితులు ఊహించిన దానికంటే చాలా దారుణంగా ఉండేలా కనిపిస్తున్నాయి.

అనిరుధ్-కావ్య మారన్ పెళ్లికి వేళాయే

వివాహం తేదీ, స్థలం, పూర్తి వివరాలు ఇవే..!



చెన్నై, నవంబర్ 9 (సమయం న్యూస్): కోలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్‌ల వివాహ ముహూర్తం దగ్గర పడింది. ఈ అంగరంగ వైభవంగా జరిగే పెళ్లి వేడుకల కోసం ఇప్పటికే పలువురు ప్రముఖులు వెన్యూకి బయలుదేరారు. తాజాగా సూపర్‌స్టార్ రజినీకాంత్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌లు కుటుంబ సమేతంగా గ్రీస్ దేశానికి పయనమయ్యారు. చెన్నై ఎయిర్‌పోర్ట్ వద్ద వీఐపీ గెస్ట్‌లు గ్రీస్ ఫ్లైట్ ఎక్కుతున్న విజువల్స్, ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సమాచారం ప్రకారం ఈ బిగ్ వెడ్డింగ్ నవంబర్ 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రీస్ దేశంలో అత్యంత ఘనంగా జరగనుంది. చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో సూపర్ స్టార్ రజినీకాంత్‌తో పాటు ఆయన కుమార్తె ఐశ్వర్య రజినీకాంత్ కనిపించారు. రజినీకాంత్ బిజినెస్ క్లాస్ కేబిన్ లో ఫ్లైట్ స్టాఫ్‌తో ఉన్న ఫోటోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ఎంకే స్టాలిన్, ఉదయనిధి స్టాలిన్‌లు సోమవారం ఉదయం ఎమిరేట్స్ ఫ్లైట్‌లో దుబాయ్ మీదుగా గ్రీస్ వెళ్లారని, వేడుకలు ముగించుకుని నవంబర్ 13న చెన్నైకి తిరిగి వస్తారని సమాచారం. అనిరుధ్ తండ్రి రవి రాఘవేంద్ర భార్య లక్ష్మి, రజినీకాంత్ భార్య లతా రజినీకాంత్‌కు చెల్లెలు కావడంతో అనిరుధ్ స్వయానా రజినీకి మేనల్లుడు అవుతారు. రజినీ నటించిన 'పేట', 'దర్బార్', 'జెయిలర్', 'వేట్టయాన్', 'జెయిలర్ 2' చిత్రాలకు అనిరుధే మ్యూజిక్ అందించడం గమనార్హం. రాజకీయ, సినీ బంధుత్వం.. చెన్నైలో రిసెప్షన్మరోవైపు కావ్య మారన్‌కు కూడా ఎంకే స్టాలిన్ కుటుంబంతో బలమైన చుట్టరికం ఉంది. కావ్య సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్, కావేరి మారన్ దంపతుల కుమార్తె. కళానిధి మారన్, ఎంకే స్టాలిన్ ఇద్దరూ వరుసకు బావబావమరుదులు అవుతారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ సీఈఓగా, సన్ టీవీ నెట్‌వర్క్ బాధ్యతల్లో కావ్య క్రికెట్, బిజినెస్ ప్రపంచంలో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకున్నారు. ఈ డెస్టినేషన్ వెడ్డింగ్ గ్రీస్‌లో నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితులు, కొద్దిమంది బంధుమిత్రుల సమక్షంలో ప్రైవేట్‌గా జరగనుండగా, గెస్టుల ప్రయాణ, వసతి ఏర్పాట్లన్నీ మారన్ కుటుంబమే దగ్గరుండి చూసుకుంటోంది. చెన్నైలో జరగబోయే గ్రాండ్ రిసెప్షన్ నవంబర్ 21న ఖాయమైంది. కళానిధి మారన్ దంపతులు స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ చెన్నై రిసెప్షన్‌కు భారత ప్రధాని నరేంద్ర మోడీ, కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి సీ. జోసెఫ్ విజయ్, అజిత్ కుమార్ సహా సినిమా, బిజినెస్, క్రికెట్ లోకానికి చెందిన హేమాహేమీలు హాజరుకానున్నారు.



లోకేష్ కనగరాజ్ 'ఆర్ఎక్స్'లో రెజీనా!

లోకేష్ కనగరాజ్‌కు చెందిన జీ స్క్వాడ్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ఆర్ఎక్స్' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైంది. రెజీనా కసాండ్రా ప్రధాన పాత్రలో నటి స్తున్న ఈ చిత్రానికి విశాల్ వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపావళి సందర్భంగా విడుదలైన పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ప్రింటెడ్ బ్లౌజ్‌తో కూడిన సంప్రదాయ మస్టర్డ్ ఎల్లో కలర్ చీరలో రెజీనా రద్దీగా ఉన్న రైలులో ప్రయాణికుల మధ్య నిలబడి కనిపిస్తున్నారు. ఆమె ముఖంలో కనిపిస్తున్న సీరియస్‌నెస్ ఏదో ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న పాత్రలా అనిపిస్తోంది. పోస్టర్‌పై కనిపించే ఈసీజీ తరహా గీతలు కూడా సస్పెన్స్‌ను మరింత పెంచుతున్నాయి. రెజీనా పవర్‌ఫుల్ లుక్ ఆమె పాత్రపై ఆసక్తిని కలిగిస్తోంది. పోస్టర్ డిజైన్ చూస్తుంటే ఈ సినిమా రా అండ్ రియలిస్టిక్, గ్రిప్పింగ్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ అందించనుందని అనిపిస్తోంది. 'సిల నేరంగళి ల్ సిల మనిధర్గల్', 'బాంబ్' వంటి చిత్రాలతో తనదైన కథన శైలికి గుర్తింపు తెచ్చుకున్న విశాల్ వెంకట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. హరిహరన్ రాజు అందించిన కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఆశమీర అయ్యప్పన్ సంభాషణలు రాశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తుండగా, ఎస్.కె. సెల్వకుమార్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జి.కె. ప్రసన్న ఎడిటర్‌గా, కె. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రానికి ప్రదీప్ భూపతి కో-ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ మొత్తాన్ని చెన్నైలో పూర్తి చేశారు. దీంతో ప్రధాన చిత్రీకరణ విజయవంతంగా ముగిసింది.



'ఈ నగరానికి ఏమైంది 2' నుంచి

యూత్‌ఫుల్ సాంగ్ రిలీజ్

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో, విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో 'ఈ నగరానికి ఏమైంది 2' (ఈఎన్ఈ రిపీట్) సిద్ధమైంది. నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఇందులోని యూత్‌ఫుల్ సాంగ్‌ని విడుదల చేశారు. 'మిత్వా.. మిత్వా' అంటూ సాగే పాటకు భరద్వాజ్ లిరిక్స్ అందించారు.





స్వీటీ నుంచి స్వీట్ న్యూస్ ఎప్పుడో?

సినిమాలకు, సామాజిక మాధ్యమాలకు దూరంగా అనుష్క శెట్టి

పుట్టినరోజునైనా శుభవార్త వస్తుందనుకుంటే నిరాశే!


హైదరాబాద్, నవంబర్ 9 (సమయం న్యూస్): సినిమాలు చేయకపోయినా కొంతమంది హీరోయిన్లు సోషల్ మీడియా ద్వారా అభిమానులతో ఎప్పుడూ టచ్‌లో ఉంటారు. తమ వ్యక్తిగత విషయాలు, సినిమా అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు పంచుకుంటూ ఫ్యాన్స్‌కు దగ్గరగా ఉంటారు. కానీ సీనియర్ హీరోయిన్ అనుష్క శెట్టి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఈ మధ్య కాలంలో ఆన్ స్క్రీన్, ఆఫ్ స్క్రీన్ మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా ఎక్కడా కనిపించడం లేదు. దీంతో అనుష్క అభిమానులు ఆమె కొత్త సినిమా అప్‌డేట్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అనుష్క చివరిగా నటించిన 'ఘాటీ' చిత్రం విడుదలై ఏడాది దాటిపోయినా.. ఆమె నుంచి మరో కొత్త సినిమా ప్రకటన వెలువడలేదు. మరోవైపు మలయాళంలో మూడేళ్ల క్రితం అంగీకరించిన 'కథనార్' సినిమా కూడా ఇంకా విడుదలకు నోచుకోలేదు. ఈ మూవీ ట్రైలర్ విడుదలై ఏడు నెలలు దాటుతున్నా.. సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే విషయంపై చిత్రబృందం స్పష్టత ఇవ్వలేదు. మలయాళ స్టార్ హీరో జయసూర్య ప్రధాన పాత్రలో భారీ బడ్జెట్‌తో కథనార్ తెరకెక్కుతోంది. ఇందులో 'నీల' అనే కీలకమైన పాత్రలో అనుష్క కనిపించనున్నారు. శ్రీ గోకులం మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 15 భాషల్లో విడుదల చేయాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా విడుదల కోసం అనుష్క ఫాన్స్ తీవ్రంగా ఎదురుచూస్తున్నారు. పుట్టినరోజున రాని అప్‌డేట్.. నిరాశలో అభిమానులునవంబర్ 7న అనుష్క పుట్టినరోజు సందర్భంగా అయినా కథనార్ సినిమా నుంచి ఏదైనా అప్‌డేట్ వస్తుందని అభిమానులు ఆశించారు. కానీ ఫ్యాన్స్‌కు నిరాశే మిగిలింది. కనీసం పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చిత్రబృందం నుంచి రాకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో స్వీటీ అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనుష్క కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్‌గా 'బాహుబలి 3' ఉండొచ్చనే ప్రచారం గతంలో జరిగినప్పటికీ, ఈ సినిమాపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పష్టత లేదు. అనుష్క కొత్త సినిమా ఎప్పుడు ప్రకటిస్తుందో, కథనార్ ఎప్పుడు విడుదలవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సినిమాలకు, సోషల్ మీడియాకు దూరంగా ఉంటున్న స్వీటీ.. త్వరలోనే అభిమానులకు ఏదైనా స్వీట్ న్యూస్ చెబుతుందేమో చూడాలి.



బాక్సాఫీస్ వద్ద 'రామాయణ' ప్రభంజనం

4 రోజుల్లోనే రూ.500 కోట్లకు చేరువలో వసూళ్లు!

బాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య విడుదలైన మైథలాజికల్ ఎపిక్ మూవీ 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద సంచలన వసూళ్లతో దూసుకెళ్తోంది. నితీశ్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ అందుకుంటోంది. నవంబర్ 5న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా తొలి నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.500 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. ముఖ్యంగా దీపావళి రోజున బాలీవుడ్‌లో అత్యధిక నెట్ వసూళ్లు సాధించిన చిత్రంగా 'రామాయణ' సరికొత్త రికార్డు సృష్టించింది. ప్రముఖ ట్రేడ్ ట్రాకింగ్ సంస్థ సాక్నిల్క్ వెల్లడించిన వివరాల ప్రకారం.. 'రామాయణ' తొలి నాలుగు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.499.20 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించినట్లు సమాచారం. భారతదేశంలో ఈ చిత్రం రూ.287.64 కోట్ల గ్రాస్, రూ.240.92 కోట్ల నెట్ కలెక్షన్లను రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో సుమారు రూ.214 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ సినిమాలోని 3ణ వెర్షన్‌కు కూడా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. 3ణ ఫార్మాట్ ద్వారా సుమారు రూ.115.46 కోట్ల వసూళ్లు వచ్చినట్లు సమాచారం. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, స్టార్ కాస్ట్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. 'రామాయణ' బాక్సాఫీస్ ప్రదర్శనలో మరో విశేషం దీపావళి రోజు సాధించిన వసూళ్లు. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ.56.15 కోట్ల నెట్ కలెక్షన్లు రాబట్టినట్లు ట్రేడ్ సమాచారం. దీంతో దీపావళి రోజున అత్యధిక నెట్ వసూళ్లు సాధించిన బాలీవుడ్ సినిమాగా ఈ చిత్రం నిలిచింది. ఇప్పటివరకు ఈ రికార్డు సల్మాన్ ఖాన్ నటించిన 'టైగర్ 3' పేరిట ఉండేది. ఆ సినిమా దీపావళి రోజున రూ.44.50 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. ఇప్పుడు 'రామాయణ' ఆ రికార్డును అధిగమించి సరికొత్త బెంచ్‌మార్క్ సెట్ చేసింది. అయితే తొలి వారాంతం ముగియడంతో ఇకపై వసూళ్ల వేగం ఎలా కొనసాగుతుందనేది ఆసక్తికరంగా మారింది. 'రామాయణ' నాలుగు రోజుల కలెక్షన్ల వివరాలు చూస్తే.. వరల్డ్ వైడ్ గ్రాస్: రూ.499.20 కోట్లకు పైగా వసూళ్లు సాధించగా, ఇండియా గ్రాస్: రూ.287.64 కోట్లు, ఇండియా నెట్: రూ.240.92 కోట్లు, ఓవర్సీస్ గ్రాస్: సుమారు రూ.214 కోట్లు, 3ణ ఫార్మాట్ వసూళ్లు: సుమారు రూ.115.46 కోట్లు. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తుండగా, మరోవైపు సినిమా పైరసీ విషయంలో చిత్ర బృందం కఠినంగా స్పందించింది. థియేటర్లలో సినిమాను రహస్యంగా రికార్డు చేసి, ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంపై బాంబే హైకోర్టు సీరియస్ అయినట్లు లీగల్ నోటీసుల ద్వారా వెల్లడించింది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**